
ఇంద్రజ ఇంటికి వెళ్లి సన్మానిస్తున్న డీఈవో కుమార్


పేదింట మెరిసిన విద్యాకుసుమం

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పేదింట విద్యాకుసుమం మెరిసింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జిల్లాలో టాపర్‌గా కలపాటి ఇంద్రజ నిలిచింది. డక్కిలి మండలం చాపలపల్లి హరిజన వాడకు చెందిన మోహన్, వరలక్ష్మి దంపతుల కుమార్తె ఇంద్రజ 5వ తరగతి నుంచి వెంకటగిరి గురుకుల పాఠశాలలో చదువుతోంది. దాతల ప్రోత్సాహం సద్వినియోగం చేసుకుంది. టెన్త్‌లో 600కిగాను 594 మార్కులు సాధించింది. 'మా పాఠశాలకు కలెక్టర్ రెండుసార్లు వచ్చారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నేనూ ఐఏఎస్ కావాలనే పట్టుదలతో చదువులో రాణించాలనుకున్నా. అమ్మ, నాన్న కూలి పనులు చేసుకుంటున్నారు. వారి శ్రమ వృథా కాకుండా ఉండేందుకు నేను కష్టపడి చదివా'నని ఇంద్రజ చెప్పారు. కాగా, ఫలితాలు విడుదలయ్యాక డీఈవో కుమార్ తదితరులు చాపలపల్లి హరిజన వాడకు వెళ్లి ఇంద్రజకు శాలువాకప్పి సన్మానించారు. రూ.లక్ష నగదు అందజేశారు.

సాయివైశాలి @ 598

గూడూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గూడూరుకు చెందిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సాయివైశాలి పదో తరగతిలో 598 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఈమె తండ్రి రామసాయి ఎన్‌డీసీసీ బ్యాంకులో సూపర్‌వైజర్‌గాను, తల్లి పద్మజ చిల్లకూరు గిరిజనకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తమ కుమార్తె రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. 'చిన్నతనం నుంచే చదువు పట్ల శ్రద్ధతో ఉండేది. క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదివింది. పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఐఏఎస్ కావాలన్నది ఆమె కోరిక' అని తల్లిదండ్రులు చెప్పారు.


తల్లిదండ్రులతో సాయివైశాలి



10 నుంచి 19వ స్థానానికి దిగజారిన జిల్లా

ఉత్తీర్ణతా శాతం 90.07 నుంచి 79.83 కి పడిపోయిన వైనం

ఈ ఏడాదీ అమ్మాయిలే టాప్

బాలికల ఉత్తీర్ణత 83.18, బాలుర శాతం 76.83


వందన (589) కేతన్ (589) స్నేహశ్రీసాయి (588) చరిష్మ (588) జ్ఞానేశ్వర్ (587)




సానియా అక్తర్ (586) విశ్వనాథ్ (586) మహాలక్ష్మి (585) సంప్రీత్ (585) మాధురి (585)

పది!! కింద పడె

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో 19వ స్థానంలో నిలిచింది. గతేడాది 90.07 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచిన జిల్లా.. ఈ ఏడాది 79.83 శాతం ఉత్తీర్ణతతో ఏకంగా 9 స్థానాలు దిగజారింది. గతేడాదితో పోల్చితే 10.24 శాతం తక్కువగా ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 81.14 శాతంకంటే కూడా జిల్లా ఉత్తీర్ణత శాతం తక్కువ కావడం గమనార్హం. గతంలో మాదిరిగానే ఈఏడాది కూడా ఫలితాల్లో బాలుర కన్నా బాలికలు 6.35 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించి తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. గతేడాది బాలుర కంటే 2.38శాతం అధిక ఉత్తీర్ణత సాధించిన బాలికలు ఈ ఏడాది తమ ఉత్తీర్ణతను మరింతగా మెరుగు పరుచుకుని అదనంగా మరో 3.97 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు.

- తిరుపతి(విద్య)

67 పాఠశాలల్లో వంద శాతం

గతేడాది జిల్లాలో 204 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈసారి కేవలం 67 మాత్రమే 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. తిరుపతి అర్బన్ మండలం అత్యధికంగా 90.47 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా పాకాల మండలం అత్యల్పంగా 55.35 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. ఇక సబ్జెక్టుల వారీగా చూస్తే.. తెలుగులో 95.03, హిందీలో 99.66, ఇంగ్లీషులో 97.07, గణితంలో 85.16, జనరల్ సైన్స్‌లో 88.47, సోషల్ స్టడీస్‌లో 93.97 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

మేనేజ్‌మెంట్ల వారీగా..

ఏపీ మోడల్ స్కూల్స్‌లో 81.43 శాతం (గతేడాది 96.03 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 52.13 శాతం (గతేడాది 82.26).. ఎయిడెడ్ పాఠశాలల్లో 82.14 శాతం (90.78).. బీసీ వెల్ఫేర్ పాఠశాలలు 93.32 శాతం (99.75).. ఏపీఆర్‌ఈఐఎస్‌లో 93.75 శాతం (98.77).. ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్‌లో 86.98 శాతం (95.60).. ఏపీటీఈఆర్‌ఎస్ పాఠశాలల్లో 74.77 శాతం (83.97).. కేజీబీవీ స్కూల్స్ 83.42 శాతం (85.79).. మున్సిపల్ పాఠశాలలు 64.77 శాతం (81.22).. జిల్లా పరిషత్ పాఠశాలు 66.03 శాతం (83.56).. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు 94.10 శాతం (98.39) చొప్పున ఉత్తీర్ణత సాధించాయి.

మండలాల వారీగా ఉత్తీర్ణతా శాతమిలా

మండలాల వారీగా ఫలితాలను చూస్తే.. తిరుపతి అర్బన్‌లో అత్యధికంగా 90.47 శాతం.. పాకాలలో అత్యల్పంగా 55.35 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. ఇక, ఎర్రావారిపాళెంలో 89.35 శాతం, చిల్లకూరు 86.59, ఓజిలి 85.47, ఆర్సీపురం 84.80, కోట 84.54, చిట్టమూరు 83.84, ఏర్పేడు 83.70, నాగలాపురం 83.19, గూడూరు 82.03, శ్రీకాళహస్తి 80.99, చంద్రగిరి 80.46, వెంకటగిరి 79.47, నాయుడుపేట 77.98, సూళ్లూరుపేట 77.96, చిన్నగొట్టిగల్లు 76.85, పుత్తూరు 76.67, డక్కిలి 76.64, వాకాడు75.50, తిరుపతి రూరల్ 73.11, రేణిగుంట 72.99, పిచ్చాటూరు 72.11, పెళ్లకూరు 70.90, కేవీబీ పురం 70.55, బాలాయపల్లి 70.09, తొట్టంబేడు 69.86, దొరవారిసత్రం 69.51, వడమాలపేట 68.87, సత్యవేడు 67.74, తడ 67.31, నారాయణవనం 62.37, వరదయ్యపాళెం 60.00, బీఎన్ కండ్రిగ మండలం 59.94 శాతం చొప్పున ఉత్తీర్ణత సాధించాయి.

బాలికలదే పైచేయి

- మొత్తం పరీక్షలు రాసింది: 26,679 మంది
- ఉత్తీర్ణత సాధించింది: 21,298 (79.83 శాతం)
- బాలురు: 14,063కి 10,804 పాస్ (76.83 శాతం ఉత్తీర్ణత)
- బాలికలు: 12,616కి 10,494 (83.18శాతం)
- ప్రథమ శేణి ఉత్తీర్ణత: 17,630 మంది
- ద్వితీయ శ్రేణి: 2,546 - తృతీయ శ్రేణి: 1,122

ఓపెన్ స్కూల్ టెన్త్‌లో 25.63, ఇంటర్లో 51.32 ఉత్తీర్ణత

తిరుపతి(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం టెన్త్‌లో 25.63, ఇంటర్‌లో 51.32 శాతం మంది జిల్లా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ పరీక్షలకు 913 మంది హాజరుకాగా 234 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో జిల్లా 13వ స్థానంలో నిలిచింది. ఇంటర్‌లో 2648 మందికిగాను 1359 మంది (51.32శాతం) ఉత్తీర్ణులు కావడంతో జిల్లా 10వ స్థానంలో నిలిచింది.

ప్రభుత్వ బడుల్లో టాపర్లు

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థుల వివరాలిలా ఉన్నాయి. కలపాటి ఇంద్రజ (ఏపీ ఆర్‌ఈఐఎస్, వెంకటగిరి) 594, ఎం.సేవిత (జడ్పీహెచ్‌ఎస్, కోటకాడపల్లె, ఎర్రావారిపాళెం) 591, ఆదేరు వందన (జడ్పీహెచ్‌ఎస్ మేనకూరు, నాయుడుపేట), ఎ.కేతన్ (ఎంపీఎల్ హెచ్‌ఎస్, బాబు అగ్రహారం, శ్రీకాళహస్తి) 589, డి.స్నేహశ్రీ సాయి (జీహెచ్‌ఎస్ పాకాల), కె.చరిష్మ (జడ్పీహెచ్‌ఎస్, పాలమంగళం) 588, టి.జ్ఞానేశ్వర్ (ఏపీ మోడల్‌స్కూల్, ఎర్రావారిపాళెం) 587, షేక్ సానియా అక్తర్ (జడ్పీహెచ్‌ఎస్ బాలికలు, వెంకటగిరి), టి.విశ్వనాథ్ (ఎస్వీజేఎన్ఎం హైస్కూల్ తిరుపతి) 586, వి.జి.మహాలక్ష్మి (జడ్పీహైస్కూల్ నారాయణవనం), ఎ.సంప్రీత్ (జడ్పీహెచ్‌ఎస్, రంగంపేట), చింతా మాధురి (ప్రభుత్వ బాలికల పాఠశాల, తిరుపతి) 585, పి.తనీష్ రాజ్ (జడ్పీహెచ్‌ఎస్ బాయ్స్, శ్రీకాళహస్తి), మేకల శేఖర్ (జడ్పీహెచ్‌ఎస్, నెలబల్లి రెట్టపల్లి)854, మూడే కీర్తనా బాయ్ (ఏపీటీడబ్ల్యుఆర్ కళాశాల, శ్రీకాళహస్తి), సి.యమున (జడ్పీపీ బాలికలు, సూళ్లూరుపేట) 583 మార్కులు సాధించారు. వీరితోపాటు మరో ఆరు గురికి 582, ఇద్దరికి 581, ఇంకో ఆరుగురికి 580 మార్కుల రాగా.. 200 మంది ప్రభుత్వ విద్యార్థులు 560కి పైగా మార్కులు పొందారు.


సేవితకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఆ పల్లె మురిసింది

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోటకాడపల్లె పంచాయతీ తడికించేనుపల్లె. ఇది ఎర్రావారిపాలెం మండలంలో.. ప్రాథమిక వసతులు అంతంతమాత్రంగా ఉండే కుగ్రామం. ఆ ఊరి నుంచి ఇద్దరు బాలికలు పదో తరగతిలో ప్రతిభ చూపారు. వీరిలో సేవిత.. పేద గిరిజన కుటుంబానికి చెందిన బాలిక. కోటకాడపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివింది. 591 మార్కులతో ఈమె ప్రభుత్వ పాఠశాలల విభాగంలో..

- టెన్త్‌లో ఇద్దరు బాలికల ప్రతిభ
- ఒకరిది తిరుపతి జిల్లాలో రెండో స్థానం..

చిత్తూరు జిల్లా టాపర్లలో మరొకరు

తిరుపతి జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. ఈమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. సేవితను బుధవారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈవో కుమార్ సన్మానించారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన ఈమెకు ఎంఈవో సతీష్ బాబు నగదు పారితోషకాన్ని అందజేశారు.


మంజుల

తడికించేను పల్లెకు చెందిన ఊటుకూరు చిరంజీవి కుమార్తె మంజుల చిత్తూరు జిల్లా భైరెడ్డిపల్లె రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివింది. 10వ తరగతిలో 590 మార్కులతో చిత్తూరు జిల్లాలోని టాపర్లలో ఈమె ఒకరుగా నిలిచింది. ఈమెదీ రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి: సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరగనున్నాయి. గురువారం నుంచి ఈనెల 30వ తేదీ లోపు ఫీజు చెల్లించాలి. రూ.50 అపరాధ రుసుంతో మే ఒకటి నుంచి 18వ తేదీ వరకు ఫీజు చెల్లించే వెసులుబాటు ఇచ్చారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్టుకు రూ.500 కాగా, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి మొత్తాన్ని మే ఒకటి వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు.

నాన్నా.. లే నాన్న

- మంచి మార్కులు సాధించా



మృతదేహం వద్ద విలపించిన కుమారుడు

కొడుకు మార్కులు తెలిసి సంబరపడ్డ కాసేపటికే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 'నాన్నా.. నీ ముఖంలో నవ్వు కోసం నేను మంచి మార్కులు సాధించా. ఒకసారి లే.. నాన్నా' అంటూ మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారుడిని చూసి అందరూ తల్లడిల్లారు. అంతకుముందే.. టెన్త్ ఫలితాల్లో తన కుమారుడికి మంచి మార్కులు వచ్చాయని తెలిసి మంచి బహుమతి తీసివ్వాలంటూ తన మిత్రుడి వద్ద సంబరపడ్డ ఆ తండ్రి.. కాసేపటికే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన శ్రీకాళహస్తి శివారులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటకు చెందిన ముత్యాలయ్య(42) ట్రాక్టర్ డ్రైవర్. ఈయనకు ఇద్దరు కుమారులు. తన స్థాయికి మించి.. పిల్లలిద్దరినీ కార్పొరేట్ పాఠశాలలో చదివించారు. పెద్దకుమారుడు జశ్వంత్ ఇటీవల టెన్త్ పరీక్షలు రాశాడు. బుధవారం ముత్యాలయ్య ట్రాక్టర్ నడుపుకొంటూ తొట్టంబేడు మండలం లక్ష్మీపురం వచ్చారు. అక్కడి నుంచి వరి పొట్టు లోడుతో మిత్రుడు మస్తాన్‌బాషాతో కలిసి నాయుడుపేటకు బయలుదేరారు. ఇంతలో తన కుమారుడు 545 మార్కులతో టెన్త్ పాసయ్యాడని తెలిసి ముత్యాలయ్య సంబర పడ్డారు. పక్కనే ఉన్న బాషాతో సంతోషం పంచుకున్నారు. తన కుమారుడికి మంచి బహుమతి ఇవ్వడంతో పాటు స్నేహితులకు పార్టీ ఇవ్వాలని చెప్పారు. మార్గమధ్యలో శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారి పక్కన ట్రాక్టర్‌ను నలిపారు. బాషాతో కలిసి పక్కనే టిఫిన్ చేసేందుకు నిలబడి ఉండగా.. అటుగా వెళుతున్న ఓ ట్రాక్టర్ ముత్యాలయ్యను ఢీకొంది.


ముత్యాలయ్య (ఫైల్ ఫొటో)

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి వరకు కుమారుడిని తలచుకుంటూ సంబరపడ్డ ముత్యాలయ్యను గుర్తు చేసుకుంటూ మిత్రుడు విలపించాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ముత్యాలయ్య కొడుకు జశ్వంత్ ఆస్పత్రికి చేరుకుని తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ విలపించాడు. నాన్నకు ప్రేమతో తన పది పరీక్ష ఫలితాలు అంకితం చేస్తున్నట్లు చెప్పాడు.


పోలీసు బదిలీల్లో వారు కోరుకున్న ప్రాంతం అడిగి తెలుసుకుని పోస్టింగ్ ఇస్తున్న ఎస్పీ

పోలీసు శాఖలో 393 మంది బదిలీ

- కౌన్సిలింగ్ నిర్వహించి.. ఆప్షన్లు తీసుకుని పోస్టింగులిచ్చిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో బుధవారం 393 మందిని బదిలీ చేశారు. దీని కోసం కౌన్సెలింగ్ నిర్వహించి.. సిబ్బంది నుంచి నాలుగేసి ఆప్షన్లు తీసుకున్న ఎస్పీ హర్షవర్ధనరాజు.. అందులో నుంచి ఒక ప్రాంతానికి బదిలీ చేస్తూ అనంతరం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, నాగభూషణం, రామకృష్ణ ఆధ్వర్యంలో ఐదేళ్లపాటు ఒకే చోట తిష్ట వేసి కూర్చున్న వారికి స్థాన చలనం కలిగించారు. ఉదయం ఏడు గంటలకే జిల్లా నలుమూల నుంచి బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. మొదట బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 27 మంది నుంచి నాలుగు స్టేషన్లు ఆప్షన్లు తీసుకున్నారు. ఇందులో బాగా పనిచేసే వారికి సముచిత స్థానం కల్పించారు. ఇందులో చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో కలిసిన వారు ముగ్గురు, నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన వారు ఐదుగురు, తిరుపతి జిల్లా వారు 19 మంది ఉన్నారు. వీరందరికీ అక్కడికక్కడే బదిలీ ఉత్తర్వులు అందచేశారు. అలాగే వంద మంది హెడ్ కానిస్టేబుళ్లు, 266 మంది కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్పీ వారు కోరుకున్న నాలుగు ఆప్షన్లలో ఉన్న ఖాళీలను బట్టి పోస్టింగ్ కల్పించారు. ఇందులో మెడికల్ గ్రౌండు కింద ఉన్న వారికి పెద్దపీట వేశారు. ప్రస్తుతం బదిలీ చేసిన వారందరూ దాదాపు కోరుకున్న స్థానాలకే బదిలీ కావడంతో పోలీసులు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన బదిలీల ప్రక్రియ మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. ఈ బదిలీల ప్రక్రియలో డీఎస్పీలను భాగస్వామ్యం చేసి వారి వద్ద పనిచేసి ప్రస్తుతం బదిలీ చేస్తున్న వారి పనితీరు, ప్రతిభ తెలుసుకుంటూ వారు కోరుకున్న ప్రాంతాలకు 393 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు ఎమ్మెల్యేలు, నేతల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చిచ్చారు. అయితే ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు కోరుకున్న నాలుగు ప్రాంతల్లోనే ఒక చోటికి ఎస్పీ బదిలీ చేయడంతో వారు కోరుకున్న చోటికే పోస్టింగ్ ఇచ్చినట్లయింది.

కరెంటు పోతే లిఫ్ట్‌లో ఇరుక్కోకుండా

తిరుమలలో ఏఆర్డీ విధానం

తిరుమల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బహుళ అంతస్తుల భవనాలన్నింటిలోనూ లిఫ్ట్‌లకు ఆటోమెటిక్ రెస్క్యూ డివైజ్ (ఏఆర్డీ) ఏర్పాటు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఒక అతిథిగృహంలో మంగళవారం కరెంట్ పోవడంతో కడపకు చెందిన ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారు 18 నిమిషాల పాటూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన సంఘటన నేపథ్యంలో ఏఆర్డీ వ్యవస్థ అన్ని లిఫ్ట్‌ల్లోనూ తప్పనిసరి చేయాలని భావిస్తున్నారు. తిరుమలలో ప్రస్తుతం 7,500పైగా గదులున్నాయి. వీటిలో 80 శాతం భవనాల్లో లిఫ్టులు ఉన్నాయి. సాధారణంగా తిరుమలలో కరెంట్ సరఫరా నిలిచిపోయినప్పుడు 35 నుంచి 40 సెంకడ్లలలో జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. అయితే జనరేటర్ ఆన్‌లో ఉన్నప్పుడు గీజర్లు, ఏసీ, లిఫ్ట్ వంటివి పనిచేయవు. ఆ సమయంలో లిఫ్ట్‌లు తిరిగి కరెంటు వచ్చేదాకా ఎక్కడున్నవి అక్కేడే నిలిచిపోతాయి. అటువంటి సందర్భంలో ఏఆర్డీ వ్యవస్థ గనుక ఉంటే సమీప అంతస్థులోకి చేరుకుని లిఫ్ట్ తలుపులు తెరుచుకుంటాయి. టీటీడీ ఈ విధానాన్ని గత మూడేళ్లుగా సన్నిధానం అతిథిగృహంలో వినియోగిస్తోంది. దాతల ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని అతిథిగృహాల్లో ఏఆర్డీ సిస్టమ్‌ను వెంటనే అమలుచేయాలని విద్యుత్ విభాగం అధికారులకు సూచనలు చేశారు. మిగిలిన భవనాల్లోనూ ఏర్పాటుకు టీటీడీ సిద్ధమవుతోంది.



తిరునగరిలో బుధవారం సాయంత్రం చిరు చీకట్లు ముసురుకుంటుండగా గగనాన కనిపించిన మనోహర దృశ్యమిది

టెన్త్‌లో ప్రతిభావంతులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఆర్‌సీపురం విద్యార్థులు 85.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు మార్కొండయ్యానాయుడు, జయవేలు తెలిపారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. వారు మాట్లాడుతూ మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లో 250మందిలో 213మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కేకేవీపురం ఉన్నత పాఠశాలకు చెందిన షహనాజ్ 570 మార్కులతో ప్రథమ, కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలకు విద్యార్థి హరిప్రసాద్‌రెడ్డి 566 మార్కులతో ద్వితీయ. కేకేవీపురం ఉన్నత పాఠశాలకు చెరందిన రిషిత 557మార్కులతో తృతీయస్థానం సాధించినట్లు వివరించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులతో కేక్ కట్ చేయించారు.

మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


నౌమాన్ అలీ- లక్ష్మీప్రసన్న

పాకాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పదవ తరగతి పరీక్షల్లో 588 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. దామలచెరువు జడ్పీ హైస్కూల్ విద్యార్థి నౌమాన్ అలీ 568, గాదంకి హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీప్రసన్న 565 మార్కులు సాధించారు. మండలంలోని 6 ప్రభుత్వ పాఠశాలల్లో 355 మంది పరీక్షలు రాయగా 166 మంది పాసయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఈవో బాబ్జీ, ఎస్ఎంసీ ఛైర్మెన్ మునిప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రూరల్ మండలంలో పద్మావతిపురం హైస్కూల్ టాప్


సూర్యప్రతాప్-పవన్‌కుమార్‌రెడ్డి-స్వాతి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రూరల్‌మండలంలోని ప్రభుత్వ పాఠశాలల(జెడ్పీహెచ్‌ఎస్) విద్యార్థులు పదవతరగతి ఫలితాల్లో 54శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో మహమ్మద్‌రఫీ తెలిపారు. పదిపాఠశాలల నుంచి 531మంది పరీక్షలకు హాజరుకాగా..288మంది పాసయ్యారన్నారు.. పద్మావతిపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత(74.63శాతం) సాధించగా..మల్లంగుంట పాఠశాలలో అత్యల్ప ఉత్తీర్ణత (37.14శాతం) నమోదైంది. కె.సూర్యప్రతాప్(తిరుచానూరు హైస్కూలు) 566, పి.పవన్‌కుమార్‌రెడ్డి (చెర్లోపల్లె జెడ్పీహెచ్‌ఎస్) 551, టి.స్వాతి 550(తుమ్మలగుంట) మార్కులు సాధించారు.

తిరుమల బడిలో 95 శాతం పాస్


మునియశ్విని - కీర్తన

తిరుమల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): తిరుమల ఎస్వీ హైస్కూల్‌లో 38 మంది పదో తరగతి పరీక్షలు రాయగా, 36 మంది పాస్ అయ్యారు. బీ మునియశ్విని, ఎస్ కీర్తన 575 మార్కులు సాధించగా, టీ రాఘవేంద్ర 544, కె సర్వేష్ 520 మార్కులు సాధించారు. ఫస్ట్ క్లాస్‌లో 23 మంది, సెండక్ క్లాస్‌లో 10 మంది, థర్డ్ క్లాస్‌లో ముగ్గురు పాస్ అయ్యారు. సింగానియా ఎడ్యూకేషన్ అకడమిక్ ఇన్‌చార్జ్ రంగలక్ష్మీ, ఇన్‌ఛార్జ్ హెడ్‌మాస్టర్ సురేంద్రబాబు విద్యార్థులను అభినందించారు. టీటీడీ పాఠశాలల్లో తిరుమల ఎస్వీ హైస్కూల్ 95 శాతం ఉత్తీర్ణతతో మొదటిస్థానంలో నిలిచింది.

పదవ తరగతిలో 65 శాతం ఉత్తీర్ణత


సోనియా- గుణశేఖర్- జాహ్నవి

భాకరాపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చిన్నగొట్టిగల్లు మండలంలో 65 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో 67 మందికిగాను 43 మంది, భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 49 మందికి 35 మంది, రంగన్నగారిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాలలో 15 మందికి ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు. చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.జాహ్నవి 578, ఎస్.సోనియా 559, గుణశేఖర్ 552 మార్కులు సాధించారు. హెచ్ఎం మృదులా దేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

పది ఫలితాల్లో శ్రీఎన్‌ఆర్‌ఐ విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థల చైర్మన్ తేజస్వీరెడ్డి

తిరుచానూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తిరుచానూరులోని శ్రీఎన్‌ఆర్‌ఐ పాఠశాల విద్యార్థులు విజయబావుటా ఎగురవేశారు. జ్యోత్స్న, శోభనాద్రిసాయి 588, మౌనికారెడ్డి, చిత్ర 561మార్కులతో పాటు 500కుపైగా మార్కులతో 20మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ తేజస్వీరెడ్డి మాట్లాడుతూ నిబద్ధత, క్రమశిక్షణతో ఉత్తమ ర్యాంకులు సాధించిమన్నారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు కోటేశ్వరి, చేతన, ఉమామహేశ్వరి, రజనిప్రియ, రాజేశ్వరి, మౌనికాదేవి, లక్ష్మీదేవి, ప్రభాకర్‌రెడ్డి, వినోద్‌కుమార్, శ్రీగౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద మౌలిక వసతుల పరిశీలన

భాకరాపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వద్ద వేసవి దృష్ట్యా మౌలిక వసతులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. తిప్పిరెడ్డిగారిపల్లెలో పశువుల తొట్టెలను,ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేయాలన్నారు. పనుల వద్ద మంచినీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ వంటివి అందుబాటులో ఉంచాలన్నారు.

వాటర్‌సంప్ వినియోగంలోకి తెచ్చేందుకు కృషి

తిరుపతి రూరల్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): వేదాంతపురంలోని వాటర్‌సంప్‌ను బుధవారం అధికారులు, సర్పంచ్‌లతో ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి కలసి పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ సంప్‌ని తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే నాని ఈవాటర్‌సంప్‌ని పరిశీలించి వినియోగంలోకి తెచ్చేందుకు నగరపాలక అధికారులతో మాట్లాడారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



చంద్రగిరి, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): ముళ్లపొదల్లో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన వైనమిది. పోలీసుల కథనం మేరకు రాయలపురం వద్ద ముళ్లపొదల్లో సుమారు 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ అనిత సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు శరీరంపై బూడిద రంగు షర్టు, ఎర్రటి రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. వివరాలకు 9440796760, 6305014261 నంబర్లకు సంప్రదించాలని పోలీసులు కోరారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి


మృతి చెందిన నరసింహులు

చంద్రగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎం.కొంగరవారిపల్లె వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో బుధవారం రాత్రి కారు ఢీ కొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఎం.కొంగరవారిపల్లెకు చెందిన నరసింహులు(72) బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో జాతీయ రహదారి దాటుతుండగా చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. నరసింహులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



భాకరాపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం వీరిని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు అలరించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు హెచ్ఎం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కిరణ్మయి, శోభ, నాగమల్లేశ్వరి, మౌనిక, షర్మిల, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. మం డలంలోని అరవ కొత్తూరుకు చెందిన రామిరెడ్డి (60) బుధవారం సొంత పనుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్రవాహ నంపై తొట్టంబేడు మండలంలోని జ్ఞానంబ కండ్రిగకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బెంగళూరు నుంచి నెల్లూరు వెళుతున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈఘట న లో రామిరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ సహా కారు ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తిప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

వెటర్నరీ యూనివర్సిటీకి రూ.154.57కోట్లు

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పశు, మత్స్య పరిశోధనకు సంబంధించి 2025-26 బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా రూ.195.73కోట్లు విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతిని ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి రూ.154.57కోట్లు, ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీకి రూ.38కోట్లు, పులివెందులలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్‌కు రూ.3కోట్లు, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి సచివాలయ ఆర్థిక అవసరాలకు రూ.16.15లక్షలు కేటాయించారు.

దాడిపై కేసు నమోదు

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో జరిగిన దాడి ఘటనలో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలోని ప్రకాశం పార్కులో బుధవారం ఉదయం 6.45 గంటలకు జగన్నాథం వాకింగ్ చేస్తున్నాడు. డబ్బుల విషయమై ఉన్న వివాదం నేపథ్యంలో సావిత్రి మరో ముగ్గురు వ్యక్తులను తీసుకొచ్చి కొట్టింది. దీనిపై జగన్నాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెతో పాటు మరో ముగ్గురిపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, వీరి మధ్య డబ్బులు ఇచ్చి పుచ్చుకునే విషయంలో గొడవలు ఉండి ఇంతకు ముందు జగన్నాథం, మరో 8 మందిపై సావిత్ర కేసు పెట్టారు.

సర్కారు బడుల్లో శతశాతం ఉత్తీర్ణత

చంద్రగిరి,ఎర్రావారిపాలెం మండలాల్లో 4 స్కూళ్ల ఘనత


జి.లహరి- పి.లోకేశ్వరి

చంద్రగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో పదోతరగతి ఫలితాల్లో ఎం.కొంగరవారిపల్లె, కొటాల ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. తొండవాడ ఉన్నత పాఠశాలలో 32 మంది విద్యార్థులకు 18 మంది, ఐతేపల్లెలో 24 మందికి 13 మంది, ఎం.కొంగరవారిపల్లెలో 10 మందికి 10 మంది, నరసింగాపురంలో 26 మందికి 19 మంది, పనపాకంలో 26 మందికి 25 మంది, చంద్రగిరి పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో 145 మందికి, 104 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 99 మందికి 52 మంది, కొటాల ఉన్నత పాఠశాలలో 9 మందికి, 9 మంది, ఎ.రంగంపేట ఉన్నత పాఠశాలలో 60 మందికి 48 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్ బాబులు తెలిపారు. ఎ.రంగంపేట విద్యార్థి ఎ.సంప్రీత్ 585, జి.లహరి 578, చంద్రగిరి విద్యార్థిని పి.లోకేశ్వరి 576 మార్కులతో వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు.

ఎర్రావారిపాలెం మండలానికి రెండో స్థానం

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో ఎర్రావారిపాలెం మండలం జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిసింది. మార్కులు, ఉత్తీర్ణతశాతంలలో రెండో స్థానం దక్కించుకుంది. అలాగే ఎర్రావారిపాలెం, వీఆర్ అగ్రహారం జడ్పీ హైస్కూళ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. కోటకాడపల్లె 71, ఉస్తికాయలపెంట96, రెడ్డివారిపల్లె76, బోడేవాండ్లపల్లె 83, నెరబైలు హైస్కూళ్లు 90శాతం ఉత్తీర్ణత సాధించాయి. స్థానిక కేజీబీవీ స్కూలులో 95 శాతం, ఆదర్శ పాఠశాల విద్యార్థులు 99 శాతం ఫలితాలు సాధించారు.


ఎర్రావారిపాలెంలో సేవితను సత్కరిస్తున్న ఎంఈవో

ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలోని ఏడుగురు ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. విద్యార్థులపై వ్యక్తిగతంగా ఒక్కో ఉపాధ్యాయుడూ చొరవ చూపించారు. అర్థమయ్యేలా బోధించడంలో టీచర్లు విశేష కృషి చేశారు. ప్రత్యేక తరగతుల్లో బాగా చదివించడంతో వంద శాతం ఉత్తీర్ణత సాధ్యమైంది.

-టి.నాథమునీ, ఎం.కొంగరవారిపల్లె హైస్కూల్ హెచ్ఎం.

సమష్టి కృషితోనే సాధ్యమైంది



మా స్కూల్‌లోని ఏడుగురు టీచర్ల సమష్టి కృషితోనే వంద శాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. పదో తరగతిలో 9 మంది విద్యార్థులున్నారు. ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటిస్తూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. తల్లితండ్రులతో మాట్లాడి మరీ పిల్లలు గైర్హాజరు కాకుండా చూసేవారు.

-ఎన్.జ్ఞానప్రకాష్, కొటాల హైస్కూల్ హెచ్ఎం

టీడీపీలో చేరిన వైసీపీ వైస్ ఎంపీపీ


నాని సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి

పాకాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాకాల మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు, వైసీపీ సీనియర్ నాయకుడు చిటిపిరాళ్ల చెన్నకేశవ రెడ్డి, ఆయన అనుచరులు బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో ఎమ్మెల్యే వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాకాల నుండి బైనపల్లె వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో భారీ బాణా సంచా పేల్చి గజమాలలతో నాయకులకు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన, పులివర్తి నాని చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావానికి ఆకర్షితుడినై టీడీపీలో చేరానని చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్గాలు విడనాడి పార్టీలకతీతంగా అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. వైసీపీ నాయకులు పరంధామనాయుడు, జెసీబి బాబురెడ్డి, ఎల్.చినబాబు, ప్రతాప్, రవి తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, జట్టీటీసీ నంగా పద్మజరెడ్డి, నాయకులు ఆముదపాకల శ్రీహరి నాయుడు, ఫల్గుణ, ఎం.వెంకటాద్రిబాబు, వై.లింగయ్యానాయుడు, కె.సావిత్రి, చాముండేశ్వరి, కె.సుధాకరయ్య, డేవిడ్ సురేష్, డి.మోహన్‌నాయుడు, టిజె.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన మూలకాలపై పరిశోధనలకు అవకాశం

● కొచ్చిన్ వర్సిటీ వీసీ జునాయిడ్ బుషిరీ


సభలో ప్రసంగిస్తున్న జునాయిడ్ బుషిరీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అరుదైన మూలకాలపై చేపట్టే పరిశోధనలు దేశాభివృద్ధికి దోహదపడాలని కొచ్చిన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం జునాయిడ్ బుషిరీ ఆకాంక్షించారు. ఎస్వీయూ ఫిజిక్స్, పద్మావతి వర్సిటీ బయోటెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎస్వీయూ సెనెట్ హాల్లో జరిగిన కార్యక్రమానికి జునాయిడ్ బుషిరీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అరుదైన మూలకాలపై అద్వితీయ పరిశోధనలకు అవకాశం ఏర్పడిందన్నారు. ఏ మూలకంలో ఏ ప్రయోజనం ఉందో శాస్త్రవేత్తలు నిర్ధారించాలని సూచించారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ జాన్ సుష్మాలను ఆయన అభినందించారు. విక్రమ సింహపురి వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కరరావు మాట్లాడుతూ సమాజ అవసరానికి అనుగుణంగా ఆవిష్కరణలు చేయాలన్నారు. ఎస్వీయూ మాజీ రిజిస్ట్రార్ హుస్సేన్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి,సైన్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అకడమిక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్ విజయలక్ష్మిలు మాట్లాడారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు పేపర్, ఓరల్, పోస్టర్ ప్రజెంటేషన్స్ చేశారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఈఏఐ) అధ్యక్షుడు డాక్టర్ దీపేంద్రసింగ్, కార్యదర్శి డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సీకే జయశంకర్, పలువురు అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెహల్గాంలో ఉగ్ర ఘాతుకంపై నిరసన



ఆర్‌సీపురంలో బీజేపీ నాయకులు- రూరల్ మండలంలో మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శనలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ పెహల్గాంలో ఉగ్రవాదుల దాడి ఘటనపై మండల బీజేపీ అధ్యక్షుడు జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో ఆర్‌సీపురం మండల కేంద్రంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఆయన మాట్లాడుతూ పర్యాటకులను దారుణంగా కాల్చిచంపిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ***తిరుపతి రూరల్:*** ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్య అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్‌మండల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన చేశారు. ఉగ్రవాదుల చేతుల్లో అకాల మరణం చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు.. వైస్‌ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీసభ్యులుపాల్గొన్నారు.

సముద్రంలోకి తాబేలు పిల్లల విడుదల



వాకాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబుపేట సముద్ర తీరంలో బుధవారం ఫారెస్టు అధికారులు ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను విడు దల చేశారు. ఈసందర్భంగా సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక మాట్లాడుతూ సూళ్లూరుపేట డివిజన్ అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా 500 ఆలివ్‌రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచి పెట్టామన్నారు. నవాబుపేట సముద్రతీరంలో తాబేలు గుడ్లను సేకరించి కృత్రిమ విధానంలో పిల్లలను పొదిగించామన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఎఫ్ఆర్‌వో నాగేశ్వరరావు, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు ఏడుకొండలు, ప్రసన్న కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పుత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని రాచపాలెం లో బుధవారం 107 ఏళ్ల వృద్ధురాలు సుబ్బలక్ష్మమ్మ మృతి చెందారు. 1918 జూన్ 1న జన్మించిన ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి వృద్ధాప్యం కారణంగా నేడు మరణించారని కుమారుడు సుధాకర్‌రాజు తెలిపారు.

ముక్కంటి సేవలో నవయుగ ఎండీ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం నవయుగ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ చింతా శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. .

తలకు కవర్ వేసి...తాడుతో గొంతు బిగించి...

● ప్రేమ వివాహం చేసుకున్న కూతుర్ని చంపిన తండ్రి అరెస్టు


యాస్మిన్(ఫైల్ ఫొటో)

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మతాంతర వివాహం చేసుకున్న చిత్తూరు యువతిని ప్లాన్ ప్రకారమే తండ్రి హత్య చేసినట్లు స్పష్టమైంది. తనకు ఆరోగ్యం బాగాలేదని కూతురుని ఇంటికి పిలిపించి ఇద్దరు బంధువుల సాయంతో దారుణంగా హత్య చేశాడు. గాయాలు కనిపించకుండా ఉండేందుకు ముందుగా తలకు కవర్ తొడిగి.. ఆ తర్వాత తాడుతో గొంతు బిగించి చంపేశాడు. తండ్రితో పాటు వరుసకు సోదరులయ్యే మరో ఇద్దరు ఈ హత్యలో పాల్గొని పరారయ్యారు. ఈ పరువు హత్య కేసులో 10 రోజుల తరువాత ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఆ వివరాలను చిత్తూరు టూ టౌన్ సీఐ నెట్టికంఠయ్య మీడియాకు బుధవారం వెల్లడించారు. చిత్తూరులోని బాలాజీ నగర్‌కు చెందిన షౌకత్ ఆలీ కుమార్తె యాస్మిన్, పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన దళిత యువకుడు సాయి తేజ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈపెళ్లి ఇష్టంలేని యాస్మిన్ తండ్రి షౌకత్ ఆలీ ఎలాగైనా కూతుర్ని చంపాలని ప్లాన్ వేశాడు. తనకు ఆరోగ్యం బాగా లేదని, ఒకసారి వచ్చి చూసివెళ్లమని కుటుంబ సభ్యులతో కూతురికి చెప్పించాడు. దీంతో సాయితేజ ఈనెల 13న చిత్తూరులో యాస్మిన్‌ను తండ్రి షౌకత్ ఆలీ, సోదర వరసయ్యే ఖాదర్‌బాషా, అబ్దుల్‌కలాంలకు అప్పగించి వెళ్లాడు. వారు యాస్మిన్‌ను కారులో ఎక్కించుకుని ఇంటికి వెళతామని చెప్పి ఇక్కడి మాపాక్షి క్రాస్‌లోని బాలాజీ హేచరీస్ సమీపంలో ఉన్న బీడుభూముల వద్దకు తీసుకెళ్లి హతమార్చారు. అనంతరం శవాన్ని బాలాజీ నగర్‌కాలనీలోని ఇంటికి తీసుకొచ్చి వరండాలో పడుకోబెట్టి పరారయ్యారు. ఈ ఘటనపై యాస్మిన్ తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య అని ప్రాథమికంగా అంచనాకు వచ్చి ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం చిత్తూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వద్ద షౌకత్ ఆలీ, బాషా లొంగిపోయారు. టూ టౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించడంతో బుధవారం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న అబ్దుల్‌కలాంను త్వరలో అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.


నిందితులను మీడియాకు చూపిస్తున్న సీఐ నెట్టికంఠయ్య

అన్నచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా మేడసాని మోహన్



తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా డాక్టర్ మేడసాని మోహన్‌ను నియమించారు. ఏడాది పాటు కాంట్రాక్టు ప్రాతిపదికన టీటీడీ బోర్డు నిర్ణయం మేరకు అయనను నియమిస్తూ టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1981లో అన్నమాచార్య ప్రాజెక్టులో రీసెర్చ్ అసోసియేట్‌గా ప్రారంభమైన ఆయన జీవితం 1986 వరకు సాగింది. 1986 నుంచి 2013 వరకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా విశేష కృషి చేశారు. ఎస్వీబీసీగా, ధార్మిక పరిషత్ సెక్రటరీగా ఐదు సంవత్సరాలు, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టులో 15 సంవత్సరాలు, భాగవత ప్రాజెక్టులో 10 సంవత్సరాలు, శ్రీనివాస వాఙ్మయ ప్రాజెక్టులో 6 సంవత్సరాల పాటు టీటీడీలో పనిచేసిన అనుభవం ఉంది. ధార్మిక కార్యక్రమాల్లో విశేష అనుభవం కలిగిన ఆయన సేవలను టీటీడీ మరోసారి ఉపయోగించుకోవాలనే తలంపుతో టీటీడీ బోర్డు ఆయనను ప్రత్యేకాధికారిగా నియమించింది.

వందన యోజనపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న శ్రీలక్ష్మి, వసంతబాయి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో బుధవారం తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల సీడీపీవోలు, ఏసీడీపీవోలు, సూపర్‌వైజర్లకు ప్రధాన మంత్రి వందన యోజనపై శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలక్ష్మి, జిల్లా నోడల్ అధికారి వసంతబాయి శిక్షణ ఇచ్చారు. పథకం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. అధికారులు షైనీ రత్న, వెంకటకృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో మంగళం ట్రెండ్స్ విజయదుందుభి



జ్యోతిష్ - రేణుక

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో మంగళం ట్రెండ్స్ జడ్పీ హైస్కూల్ విజయదుందుభి మోగించింది. అత్యధిక ఉత్తీర్ణత శాతంతో పాటు పలువురు విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. సి.జ్యోతిష్ 564, రేణుక 564, శశికుమార్, పూనందేవి 551 మార్కులతో సత్తా చాటారు. అంతేకాకుండా 20మంది విద్యార్థులు 500పైబడి మార్కులు సాధించారని హెచ్ఎం కేశవులనాయుడు తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖర రావు తెలిపారు. టీకే స్ట్రీట్, కేకే లేఅవుట్, రైల్వే కాలనీ, సుందరయ్య నగర్, ఎస్వీ, పద్మావతి మెడికల్ కళాశాలలు, స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులు, చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ కాలనీ, గాలివీధి, అనంతవీధి, మంచాలవీధి, సింగాలగుంట, త్యాగరాజనగర్, వరదరాజనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్‌జీవో కాలనీ, రామచంద్రనగర్, కేటీ రోడ్డు, శాంతినగర్, ఇస్కాన్ రోడ్డు, అన్నారావు సర్కిల్, గాంధీరోడ్డు, ప్రకాశం రోడ్డు, జీఎన్ మాడవీధులు, శ్రీనగర్‌కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, గోవిందనగర్, లెప్రసీ కాలనీ, ఎస్ఎల్వీ నగర్, మాధవ నగర్, ఎర్రమిట్ట, రాయలవారి వీధి తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీతాలు ఇవ్వాలని నిరసన



ఆస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు, ఏఐటీయూసీ నేతలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు ఇవ్వాలని ప్రసూతి ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టమై ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏజన్సీ నిర్వాహకులు జీతాలు సరిగా ఇవ్వకున్నా ఆస్పత్రి యాజమాన్యం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ కూడా చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. కలెక్టరు పలుమార్లు ఏజన్సీ నిర్వాహకులను హెచ్చరించినా ఫలితం కనిపించడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్టా మహేంద్ర, నేతలు విశ్వనాథ్, రవి, పెంచలయ్య పాల్గొన్నారు.

సైబర్ వలలో చిక్కి రూ.1.05 లక్షలు పోగొట్టుకున్న యువతి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ యువతి రూ.1.05 లక్షలు పోగొట్టుకుంది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీకి చెందిన యువతి హార్టికల్చర్ కోర్సు పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉంది. గూగుల్ మ్యాప్స్ రేటింగ్ పేరుతో వర్క్ ఫ్రం హోం జాబ్ అవకాశముందని ఓ వ్యక్తి గతనెల 13వ తేదీన వాట్సాప్ నంబరు 8099860801 ద్వారా ఆమెను సంప్రదించాడు. అటు తర్వాత టెలిగ్రాం లింక్ ద్వారా సోఫియా అనే యూజర్ ఐడీతో చాటింగ్ జరిపాడు. కొన్ని చిన్న టాస్కులు ఇస్తూ చిన్న మొత్తంలో డబ్బులు పంపించడంతో ఆమెకు నమ్మకం కలిగింది. అనంతరం పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందని నమ్మించి 04181 టు ది హైఎస్ట్ క్రిప్టో ట్రేడింగ్ అనే టెలిగ్రామ్ గ్రూపులో జాయిన్ చేయించారు. మర్చంట్ టాస్కుల పేరుతో వేర్వేరు యూపీ ఐడీలకు ఆ యువతి రూ.1.05 లక్షలు చెల్లించారు. ఆ తర్వాత వారి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించి బుధవారం రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ఎస్టేట్ అధికారిగా సువర్ణమ్మ

డిప్యూటీ ఈవోగా వెంకటసునీల్

తిరుపతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తూ డెప్యుటేషన్‌పై దేవదాయ శాఖకు బదిలీ అయిన జి.సువర్ణమ్మ, టి.వెంకట సునీల్ తాజాగా టీటీడీలో వేర్వేరు పోస్టుల్లో నియమితులయ్యారు. రెవెన్యూ శాఖలో పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న వీరిద్దరినీ ప్రభుత్వం ఈనెల 15వ తేదీన దేవదాయ శాఖకు డెప్యుటేషన్‌పై పంపిన సంగతి తెలిసిందే. బుధవారం సువర్ణమ్మను టీటీడీ ఎస్టేట్స్ అధికారి పోస్టులోనూ, వెంకట సునీల్‌ను టీటీడీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టులోనూ నియమిస్తూ దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత పోస్టుల్లో వీరిద్దరూ ప్రాథమికంగా ఏడాదిపాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టీటీడీలో తదుపరి పోస్టింగుల కోసం వారిద్దరూ ఈవో ఎదుట రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

భాష్యకార్ల ఉత్సవం ప్రారంభం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గోవిందరాజ స్వామి ఆలయంలో బుధవారం భాష్యకార్ల ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు పెద్దమాడ వీధి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం చేపట్టారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

30 నుంచి అవతార మహోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య కళామందిరంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి మే 2వ తేదీ వరకు రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భగవద్ రామానుజాచార్యులపై సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు ఉంటాయి. 30న సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్దజీయర్, చిన్నజీయర్ స్వాముల మంగళ శాసనాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రముఖుల ఉపన్యాసాలు, భక్తి సంగీత కార్యక్రమాలు ఉంటాయి.

3న కోదండరామాలయంలో పుష్పయాగం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో మే 3వ తేదీన పుష్పయాగం నిర్వహించనున్నారు. మే 2న సాయంత్రం పుష్పయాగానికి అంకురార్పణ చేయనున్నారు. మార్చి 27 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో తెలిసీ, తెలియక జరిగిన లోపాల నివారణకు పుష్పయాగం చేయడం ఆనవాయితీ. 3న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పుష్పయాగం అనంతరం ఊరేగింపు నిర్వహిస్తారు.

పోలీసులకు ఇంటర్వెన్షన్ కోర్సు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి రిజర్వు గ్రౌండులో పోలీసులకు ఈనెల 21వ తేదీ నుంచి ఇంటర్వెన్షన్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఉగ్రవాదుల దాడి జరిగినప్పుడు స్పెషల్ పార్టీలు వచ్చేంత వరకు వ్యవహరించాల్సిన అంశాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు.

కుంటల సుందరీకరణ పనులు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో కుంటల సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కుంటల సుందరీకరణ పనులపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. నీటి వనరుల అభివృద్ధికి, ట్యాంకుల పునరుద్ధరణకు సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. ముఖ్యంగా దామినేడు, పేరూరు, అవిలాల రామక్క, తూకివాకం, వెంకటాపురం, ఎల్లమండ్యం, వినాయకసాగర్, గొల్లవానిగుంట, కొరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

గొలుసు దొంగ అరెస్టు

రెండు సెల్‌ఫోన్లు, బంగారు చైను స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి వెస్ట్ పరిధిలో గొలుసు దొంగను అరెస్టు చేసి, బంగారు చైను, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా యాదమరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దేవరాజులు తిరుపతి రూరల్ మండలం బీటీఆర్ కాలనీలో కాపురముంటూ పెయింట్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తిరుపతి నగరంలో పలుచోట్ల చోరీలకు పాల్పడ్డాడు. గతనెల త్యాగరాజనగర్‌కు చెందిన మహిళ మెడలో గొలుసు చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం దేవరాజులును అరెస్టు చేశారు. అతని నుంచి 17 గ్రాముల బంగారు చైను, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

టూరిస్టులపై ఉగ్రదాడి అమానుషం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కరుణాకరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు అమానుషమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ పద్మావతీపురంలోని భూమన నివాసం నుంచి తిరుచానూరు బైపాస్ రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ దాడిని రాజకీయాలకతీతంగా ఖండించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. భూమన అభినయ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

22ఏ నుంచి ఆటోనగర్‌కు విముక్తి కల్పించండి



మంత్రికి సమస్యను వివరిస్తున్న దేవేంద్రరెడ్డి

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఆటోనగర్‌ను 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించాలని ఫ్యాప్సియ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేంద్రరెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సేల్ డీడ్‌తో ఎన్టీఆర్ ప్రభుత్వం ఆటోనగర్‌లో భూములు కేటాయించిందన్నారు. అనంతరం ఆ భూములను 22ఏ జాబితా కింద చేర్చారని తెలిపారు. మెకానిక్‌లు బ్యాంకు రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రేపు సత్యవేడులో మెగా జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సత్యవేడులోని దాస్ ఆర్ట్స్, సైన్స్ కళాశాల వేదికగా శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శ్రీసిటీ, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీల్లో 800 ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440374535ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానిపై తప్పుడు ప్రచారం మానుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై తప్పుడు ప్రచారం మానుకోవాలని, ఆయన తమ అసోసియేషన్ నుంచి కమీషన్ తీసుకుంటున్నాడన్న ఆరోపణలు అవాస్తవమని శ్రీబాలాజీ ట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్టాభిరెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహులునాయుడు పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రాక్టర్‌కు రూ.3వేలు నుంచి రూ.5 వేలు వరకు కమీషన్లు తీసుకునేవారని, ప్రస్తుతం అలాంటివి ఏమీ లేకుండా హాయిగా ఇసుక తరలించుకుంటున్నామని తెలిపారు. అయితే చెవిరెడ్డి, అతని అనుచరులు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పరందాం యాదవ్, భాస్కర్‌రెడ్డి, శ్యామ్‌బాబు, సందీప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చెంచురెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం క్యాండిల్ ర్యాలీ



తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కోసం సీపీఎం నాయకులు బుధవారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం నుంచి సుందరయ్యనగర్‌లోని కమ్యూనిటీ భవన్ వరకు ర్యాలీ సాగింది. పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీజేపీ నేతల తీరువల్లే ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారని తెలిపారు. నాయకులు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, డాక్టర్ సాయిలక్ష్మి, మాధవ్, మల్లారం నాగార్జున పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పది ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. డక్కిలి మండలం చాపలపల్లి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చెందిన ఇంద్రజ 594 మార్కులు, ఎర్రావారిపాలెం మండలం కోటకాడపల్లికి చెందిన సేవిత 591 మార్కులు, నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన వందన 589 మార్కులు, శ్రీకాళహస్తి బాబుఅగ్రహారం పాఠశాలకు చెందిన కేతన్ 589 మార్కులు సాధించారు. కలెక్టరేట్‌లో వీరిని కలెక్టర్ అభినందించి ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో కేవీఎన్ కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి తైక్వాండో శిక్షణ

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి కాంప్లెక్స్‌లోని తైక్వాండో ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం నుంచి ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం కానుందని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాండ్ మాస్టర్ డాక్టర్ గోపీనాయుడు పర్యవేక్షణలో మే నెలాఖరు వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉదయం 6.30నుంచి 8.30వరకు శిక్షణ ఉంటుందని, మరిన్ని వివరాలకు 9572144231, 7013591635 లను సంప్రదించాలని కోరారు.

టెన్త్ ఫలితాల్లో ప్రైవేట్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభచాటారు. ఆ వివరాలను ఆయా పాఠశాలల నిర్వాహకులు పేర్కొన్నారు.



విద్యార్థులతో మాతృశ్రీస్కూల్ చైర్మన్ సుధాకర్‌నాయుడు

● **మాతృశ్రీ విద్యార్థుల విజయకేతనం:** రైల్వేకాలనీలోని మాతృశ్రీ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని చైర్మన్ డాక్టర్ కె.సుధాకర్‌నాయుడు పేర్కొన్నారు. ఎం.రెడ్డిసాయినాయుడు 588మార్కులు, ఎస్.పవన్ 587, కె.లక్ష్మిజ్ఞానాక్షాయ 584, జి.కార్తీక్ 581, ఎ.శ్రీజ 580మార్కులతో రాణించారని తెలిపారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు 500-590 మార్కుల మధ్య 38మంది విద్యార్థులు సాధించారన్నారు.



విద్యార్థులతో రెడ్‌చెర్రీస్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి

● **రెడ్‌చెర్రీస్ విద్యార్థుల సంచలనం:** నగరంలోని రెడ్‌చెర్రీస్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సంచలన విజయాలు నమోదు చేశారని డైరెక్టర్ ఎన్.సునీల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. టి.మోక్షప్రియ 596మార్కులు, ఎ.డోలాశ్రీదుర్గ 594, ఎ.రితన్య, బీవీ నిషాంత్ 593 మార్కులతో ప్రతిభచాటారన్నారు. 590కిపైగా 10మంది, 580కిపైగా 25మంది, 570కిపైగా 52మంది విద్యార్థులు మార్కులు సాధించి సత్తాచాటారని తెలిపారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ జనార్దన్‌రెడ్డి

● **చైతన్య భారతి విద్యార్థుల ప్రతిభ:** హథీరాంజీ కాలనీలోని చైతన్య భారతి స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటారని కరస్పాండెంట్ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. హేమలత 587, మనోజ్ 582, చందన 579 మార్కులతో సత్తా చాటారన్నారు. 87 శాతం మంది ప్రథమ శ్రేణిలో పాసవగా ప్రతి ఇద్దరిలో ఒకరు 500లకు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్, ఇన్‌చార్జి వెంకటరమణ అభినందించారు.

● **ప్రతిభలో విష్ణుప్రియ టాపర్**



విష్ణుప్రియ

భవానీ నగర్‌లోని ప్రతిభ విద్యాలయలో విద్యార్థి ఎం.విష్ణుప్రియ 600లకు గాను 581 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

● **లిటిల్ ఏంజిల్స్ విద్యార్థుల ఆధిపత్యం**



కేశవాయనగుంటలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఆధిపత్యాన్ని చాటారని కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్.అలేఖ్య 582మార్కులు, సి.పెరున్‌కుమార్ 568, డి.కావ్య 542 మార్కులతో ప్రతిభచాటారని తెలిపారు. విద్యార్థులను చైర్‌పర్సన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ కేఆర్ శ్వేతారెడ్డి, టీచర్లు అభినందించారు.



● **ప్రసన్న భారతి విద్యార్థుల సత్తా:** ప్రసన్న భారతి ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారని కరస్పాండెంట్ కె.ఈశ్వరయ్య తెలిపారు. లిఖితసాయి 586, శివప్రసాద్ 583, యోగిత 579 మార్కులతో వరుసగా తొలి మూడు స్థానాలు సాధించారని తెలిపారు. 550కి పైగా 10 మంది, 500లకు పైగా 21 మంది విద్యార్థులు మార్కులు పొందారన్నారు.

● **సుధహో విద్యార్థుల ఆధిపత్యం:** ఆర్సీ రోడ్డులోని సుధహో లిటిల్ సిటిజెన్స్ విద్యార్థులు మంచి మార్కులు పొంది ఆధిపత్యాన్ని ప్రదర్శించారని కరస్పాండెంట్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ జోగిరెడ్డి రాజేంద్రప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. హారిక 576, నితీష్ 571 గురుప్రియతమ్ 555 మార్కులతో ప్రతిభ చాటగా పది మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు పొందారన్నారు.



● **విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ:** సత్యనారాయణపురంలోని శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటారని కరస్పాండెంట్ నీరజాశ్రీనివాస్ పేర్కొన్నారు. 100 శాతం ఉత్తీర్ణతతో పాటు 588, 586 వంటి అత్యుత్తమ మార్కులను సాధించారని తెలిపారు.



● **నవజీవన్ అంధ విద్యార్థుల ప్రతిభ**

తిరుచానూరులోని నవజీవన్ అంధుల ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటారని పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె.శ్రీధరాచార్య పేర్కొన్నారు. 13 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ పాసయ్యారన్నారు. విద్యార్థులను టీచర్లు, సిబ్బంది అభినందించారు.



తిరుమలలో ప్రారంభమైన భాష్యకారుల ఉత్సవాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. 19 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మే 2న భాష్యకార్ల సాత్తుమొర ఉంటుంది. శ్రీరామానుజులవారు జన్మించిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. మొదటిరోజున బుధవారం ఉదయం శ్రీరామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా జీయంగార్లు దివ్యప్రబంధ గోష్ఠి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద, చిన్న జీయర్ స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల ఘాట్‌లో పల్టీకొట్టిన సుమో




● ఏడుగురికి గాయాలు

తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో బుధవారం సుమో బోల్తాపడి ఏడుగురు భక్తులు గాయపడ్డారు. కర్ణాటకకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని బుధవారం ఉదయం వాహనంలో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 35వ మలుపు వద్ద సుమో అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను తిరుపతిలో రుయాస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,828

తలనీలాలు సమర్పించినవారు: 21,165



సివిల్స్‌లో సాయి 'తేజ'స్సు

● కోచింగ్ లేకుండానే 154వ ర్యాంకు సాధన

నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సాధించిన దానితో ఆ యువకుడు సంతృప్తి చెందలేదు. అనుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించాడు. నిన్నటి సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకుతో మెరిశాడు. నాయుడుపేట మండలం చిలమత్తూరుకు చెందిన నెల్లూరు సాయితేజ. ఈయన తండ్రి శ్రీనివాసులు చిల్లకూరు మండలం గమళ్ళదిబ్బలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి సరస్వతి ఓజిలిలో హెల్త్ సూపర్‌వైజరుగా పనిచేస్తున్నారు. వీరు 20 ఏళ్ళ కిందట చిల్లకూరులో స్థిరపడ్డారు.

ఎలాంటి కోచింగూ పొందలేదు

సివిల్ సర్వీసెస్ కోసం ఎలాంటి కోచింగ్ ప్రత్యేకించి తీసుకోలేదు. అంతా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్‌తో ప్రిపేర్ అయ్యాను. ఐఎఫ్ఎస్‌కి ఎంపిక కావాలనేది నా లక్ష్యం. అందుకే గతేడాది సివిల్స్‌లో 558వ ర్యాంకు వచ్చినా మళ్లీ రాశాను. ఈసారి 154వ ర్యాంకు వచ్చింది. అమ్మానాన్న, కుటుంబ సభ్యులు ఈవిషయంలో బాగా ప్రోత్సహించారు.

- నెల్లూరు సాయితేజ,
సివిల్స్ 154వ ర్యాంకర్

పట్టువదలని విక్రమార్కుడిలా..

సాయితేజ 1నుంచి 5వ తరగతి వరకు నాయుడుపేట మండలం గొట్టిప్రోలు ఎలిమెంటరీ పాఠశాలలో చదివారు. 6 నుంచి 10 వరకు చిల్లకూరు లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో, ఇంటర్మీడియట్ శ్రీచైతన్య(విజయవాడ)లో చదివారు. హైదరాబాదులో బీటెక్ చదివారు. సివిల్ సర్వీసెస్‌కు మంచి ర్యాంకుతో ఎంపిక కావాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇందుకోసం కష్టపడి ప్రిపేర్ అయ్యారు. కష్టం ఫలించి గతేడాది 558వ ర్యాంకు పొందారు. అయినప్పటికీ సాయితేజ సంతృప్తి చెందలేదు. పట్టుదల వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాన్ని కొనసాగించారు. ఫలితంగా తాజాగా ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకు పొందారు. ఈయన భార్య జ్యోతిర్మయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. తమ్ముడు నెల్లూరు విష్ణుతేజ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. సాయితేజకు సివిల్స్‌లో మెరుగైన ర్యాంకు వచ్చిందని తెలియగానే చిలమత్తూరులో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.



భార్య, తల్లిదండ్రులతో సాయితేజ

అనుకున్నది సాధించాడు

చిల్లకూరు, ఆంధ్రజ్యోతి: 'మా అబ్బాయి సాయితేజకు ఐఏఎస్ కావాలన్నది లక్ష్యం. గతేడాది 558వ ర్యాంకుతో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. ఐఏఎస్ కావాలన్న పట్టుదలతో ఈసారి 154వ ర్యాంకుతో అనుకున్నది సాధించాడు' అని సాయితేజ తల్లిదండ్రులు నెల్లూరు శ్రీనివాసులు, సరస్వతి బుధవారం ఆనందం వ్యక్తంచేశారు. తమ కుమారుడు కొన్నేళ్లుగా బీహెచ్ఈఎల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడన్నారు. ఐఏఎస్‌గా పేదలకు న్యాయం చేయడమే అతడి ఉద్దేశ్యమని చెప్పారు.

రైల్లో చోరీ చేసి పారిపోతూ... గ్రామస్తులకు పట్టుబడ్డ నంద్యాలవాసి

● పోలీసులకు అప్పగించిన చెంగారెడ్డిపల్లెవాసులు



రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన దొంగ

రేణిగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం ఉదయం 2 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లెలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం అర్ధరాత్రి గూడూరు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులో బ్యాగును ప్రయాణికుడు చోరీ చేశాడు. బ్యాగుతో రేణిగుంట రైల్వేస్టేషన్ ఔటర్‌లో దిగి పారిపోయే క్రమంలో చెంగారెడ్డిపల్లెలోకి చేరుకున్నాడు. వీధి కుక్కలు పెద్ద ఎత్తున మొరగడంతో గ్రామస్తులు ఒక్కసారిగా మేల్కొన్నారు. దీంతో నిందితుడు ముళ్లపొదల్లో దాక్కున్నాడు. గ్రామస్తులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతని ఆధార్ కార్డు ద్వారా నంద్యాలకు చెందిన హరీష్‌గా గుర్తించారు. చోరీ చేసిన బ్యాగ్‌ను పరిశీలించగా బంగారు నగలు ఉన్నట్టు గుర్తించారు. అయితే అవి రోల్డ్ గోల్డ్ అని తెలుసుకున్నారు. బంగారు నగలు అనుకుని ఆ బ్యాగ్‌ను చోరీ చేసి ఉంటాడని భావించారు. నెం.100కు ఫోన్ చేసి నిందితుడిని అర్బన్ పోలీసులకు అప్పగించారు. చోరీ జరిగింది రైలులో కావడంతో రైల్వే జీఆర్పీ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ రవి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జిల్లాలో ఐదుగురు సీఐల బదిలీ

● వీఆర్‌లో ఉన్న ఇద్దరికి పోస్టింగ్
● ఈస్ట్‌కు శ్రీనివాసులు నియామకం



సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బదిలీ అయిన వారిలో తిరుపతి వెస్ట్‌లో పనిచేస్తున్న రామకృష్ణను సోషల్ మీడియా విభాగానికి నియమించారు. ఈస్ట్ సీఐగా పనిచేస్తున్న జగదీష్‌ను అనంతపురం పీటీసీకి.. జిల్లా ఎస్పీ వీఆర్‌లో ఉన్న మద్దయ్యాచ్చారిని తిరుమల స్పెషల్ బ్రాంచ్‌కు, తిరుపతిలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్ బాషాను భాకరాపేటకు, వీఆర్‌లో ఉన్న కె.శ్రీనివాసులును తిరుపతి ఈస్ట్‌కు నియమించారు. వెస్ట్ పీఎస్‌లో అటాచ్‌మెంటులో సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్‌ను అక్కడే రెగ్యులర్ సీఐగా నియమించారు. వీరందరూ తక్షణం వారి వారి స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని డీఐజీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుపతిలో బాలికపై అత్యాచారం

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ మేరకు బుధవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి నగరానికి చెందిన 16 ఏళ్ల బాలికకు చెర్లోపల్లెకు చెందిన రవికుమార్‌తో పరిచయం వుంది. ఇతను ఫ్లోరింగ్ టైల్స్ పనులు చేస్తున్నాడు. ఇతని స్నేహితులు సింగాలకుంటకు చెందిన సాయికుమార్ ఫోటో ఫ్రేమ్ వర్కు చేస్తున్నాడు. ఈ నెల 17న ఆ బాలిక సాయికుమార్‌తో కలిసి వెళ్లింది. ఇంట్లో కనిపించకపోవడంతో తల్లితండ్రులు వెస్ట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, చెర్లోపల్లె వద్ద గది తీసుకున్న ముగ్గురు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు బుధవారం బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐ మురళీమోహన్ వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారిస్తున్నారు. ఈ ఘటనలో సాయికుమార్ స్నేహితుడు ప్రకాశం జిల్లాకు చెందిన రవి సైతం పాల్గొన్నట్లు రుజువు కావడంతో అతడిపైనా కేసు నమోదు చేశారు.

'ఎంఎస్ఎంఈ' పార్కుల అభివృద్ధికి ప్రణాళిక

● ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం
● ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి శ్రీనివాస్



కలెక్టరేట్‌లో అధికారులు, పరిశ్రమలతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు రాబోతున్నాయని, వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులతో అటు పారిశ్రామికాభివృద్ధి, ఇటు నిరుద్యోగ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికారులతో పాటు ఎఫ్ఎస్ఎంఈ, ఫ్యాప్సియో, ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్, టెక్స్‌టైన్ నగరి అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎంఎస్ఎంఈలో వృద్ధి సాధిస్తున్నామని వారి కోసం బెస్ట్ పాలసీ తీసుకొస్తామన్నారు. ఔత్సాహికులకు చేయూతనిచ్చి, ఉత్పత్తులను పెంచే దిశగా ఊతమివ్వడం ఉద్యోగ ఉపాధి అవకాశాలు మార్కెటింగ్ సదుపాయాల పెంపు కోసం కృషి చేస్తుందన్నారు. తిరుపతి, చిత్తూరులో పరిశ్రమల అభివృద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకువచ్చి సింగిల్‌విండో పద్ధతిన అన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం సూచించిన ప్రణాళికల ఆధారంగా కృషి చేస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల వారు తీసుకునే రుణాలను జీవనోపాధి వైపు మళ్లించి వ్యాపారవేత్తలుగా తయారుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమన్నారు. అంతకుముందు పరిశ్రమల అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు ఎంఎస్ఎంఈ, ఉమ్మడి జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఆక్సిజన్ పరిశ్రమకు భూమిపూజ

పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి కొండపల్లి సమావేశం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో ఎంఎస్ఎంఈ కేటగిరికి చెందిన 'గుప్తా ఆక్సిజన్ ప్రైవేటు లిమిటెడ్‌కు బుధవారం రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. రూ.40కోట్లతో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ 2025 అక్టోబరు నాటికి ఉత్పత్తులు ప్రారంభించనుంది. డ్యూ గ్యాస్ పేరిట పారిశ్రామిక గ్యాస్‌ను ఇది ఉత్పత్తి చేస్తుంది. ఏపీ ఆటోమేటిక్ రంగాలకు గ్యాస్ సరఫరా చేయనుంది. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఆసంస్థ ఎండీ, సీఈవో ఆనంద గుప్తా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీసిటీ పరిసరాల్లో పర్యటించారు. ఎవర్టన్ టీ పరిశ్రమను సందర్శించారు. 90శాతం పైగా స్థానిక గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈ పరిశ్రమ, మహిళా సాధికారత, సమ్మిళిత వృద్ధికి చక్కని నమూనాగా కొనియాడారు. తన పర్యటనలో భాగంగా ఆయన శ్రీసిటీ పరిశ్రమల సీఈవోలతో సమావేశమయ్యారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషి చేస్తున్నట్లు ఆయన అభినందించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పీ4 విజన్ పయనం సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఏపీకే రెడ్డి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు హాజరయ్యారు. వారితో పాటు ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలత్తూరులో 80 పరిశ్రమలకు భూముల కేటాయింపు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆంధ్రజ్యోతి: బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు ఏపీఐఐసీలో 80 పరిశ్రమలకు భూములు కేటాయించినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆలత్తూరులో ఏపీఐఐసీ భూములను బుధవారం ఆయన పరిశీలించారు. భూముల రికార్డులను అధికారులు మంత్రికి వివరించారు.

శ్రీనివాస సముదాయంలో క్రీడా వేదికలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో పలు క్రీడా వేదికలను రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పికిల్ బాల్, బాస్కెట్ బాల్, రైఫిల్ షూటింగ్ ఆడుతూ కాసేపు సరదాగా గడిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడుల్లో మృతిచెందిన పర్యాటకుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. దక్షిణాదిన ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. పేద క్రీడాకారులు ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనడానికి వీలుగా ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2నుంచి 3శాతానికి పెంచిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్మార్ట్‌సిటీ నిధులతో ఇందిరా మైదానంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన, ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభించామన్నారు. గొల్లవానిగుంటలో నిర్మాణ దశలో ఆగిపోయిన క్రికెట్ స్టేడియాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి చర్యలు ప్రారంభించామన్నారు. టీటీడీ కేటాయించిన రూ.కోటి నిధులతో సముదాయంలో మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గుంటూరుకు చెందిన హాట్రిక్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొపయిటర్ అండ్ బ్రదర్స్ శ్రీరామ్ క్రీడాకారుల ప్రయోజనార్థం రూ.2 లక్షలతో క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, టీటీడీ బోర్డు సభ్యుడు పనబాకలక్ష్మి, మహిళా వర్సిటీ వీసీ ఉమ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, మహేష్‌యాదవ్, ఊకా విజయ్‌కుమార్, వరప్రసాద్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, దాతలు ప్రణీత్, వై.ప్రవీణ్, శ్రీధర్, క్రీడా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో రైఫిల్ షూటింగ్ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి, శాప్ చైర్మన్ రవినాయుడు, నాయకులు

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ10లక్షల విరాళం



తిరుపతి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గుడివాడకు చెందిన ఎన్ఆర్ఐ చల్లగుల్ల సాయిరాజ తరఫున ఆయన తండ్రి ప్రసాద్ రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మికి ప్రసాద్ విరాళం మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు.

స్వల్పంగా ధర తగ్గిన బంగారం

● కాస్త పెరిగిన కొనుగోళ్లు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు స్వల్పంగా తగ్గడంతో తిరుపతిలోని కొన్ని కార్పొరేట్ స్థాయి దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించింది. అదే పెద్ద, చిన్న దుకాణాలు వెలవెలపోతున్నాయి. నిన్నటి వరకు 22 క్యారెట్ల బంగారం గ్రాము 10,200 వరకు పలికింది. అదే బుధవారం మధ్యాహ్నానికి గ్రాముపై రూ 300 తగ్గి రూ.9900 వరకు చేరింది. అదే 24 క్యారెట్ల బంగారం గ్రాము 10,250 నుంచి 9900కు వచ్చింది. దీంతో పెళ్లిళ్లు, ఇతర అవసరాల నిమిత్తం పలువురు బంగారం కొనేందుకు ఆసక్తి చూపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని కొన్ని బంగారు దుకాణాల వద్ద బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కొంత సందడిగా కనిపించింది. అదే బజారు వీధిలోని దుకాణాల వద్ద ఎవరూ లేరు. నగరంలో తిరుపతిలో చిన్నా చితక దుకాణాలు దాదాపు 550 వరకు వున్నాయి. అదే కార్పొరేట్ స్థాయి షాపులు దాదాపు 12 వరకు వున్నాయి. వీటిల్లో రోజుకు గతంలో అయితే రూ ఆరు కోట్లు నుంచి 8 కోట్లు వరకు వ్యాపారం జరిగేదని ప్రస్తుతం బంగారం ధరలు బాగా పెరగడంతో రోజుకు రూ.మూడు కోట్ల వ్యాపారం కూడా జరగడం లేదని దుకాణాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఇప్పుడు గ్రాము బంగారంపై రూ.300 మాత్రమే తగ్గింది. ఇది స్థిరంగా ఉండే అవకాశాల్లేవు. పరిస్థితులను బట్టి రానున్న ఆరు నెలల కాలంలో మరింత పెరిగే అవకాశాలున్నాయి' అని బంగారు దుకాణాల సంఘం అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ అన్నారు. కాగా, వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన పర్యాటకులకు కొవ్వొత్తుల నివాళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకులకు బుధవారం తిరుపతిలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కృష్ణాపురం ఠాణా నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అంతకుముందు ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో జనసేన పార్టీ జెండాను ఎమ్మెల్యే శ్రీనివాసులు అవనతం చేశారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, సుభాషిణి, బాబ్జి, రాజేష్ ఆచారి, దినేష్‌జైన్, బాలిశెట్టి కిషోర్, లక్ష్మీపతి, మునస్వామి, హేమంత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శిరీష, అక్బర్ పాల్గొన్నారు.

బియ్యం స్టాక్‌లేదు.. డబ్బులిస్తాం తీసుకోండి!

● ఎండీయూ ఆపరేటర్ల నిర్వాకం ● కార్డుదారులకు అందని బియ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల బియ్యం స్టాక్ తక్కువగా వచ్చింది.. బియ్యానికి బదులుగా డబ్బులిస్తాం తీసుకోండి.. అంటూ ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు కార్డుదారులను కోరుతున్నారు. తమకు బియ్యమే కావాలని కార్డుదారులు చెప్పినా వినకుండా వేలిముద్ర వేసి చక్కెర, కందిపప్పు తీసుకుని వెళ్లిపోండని ఒత్తిడి చేస్తున్నారు. ఏప్రిల్ నెల పూర్తికావస్తున్నా సూళ్లూరుపేట పట్టణంలో నేటికీ పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం పంపిణీ జరగలేదు. రేషన్ షాపుల వద్దకు వెళితే... మాకు సంబంధం లేదు.. ఎండీయూ వాహనాలు వస్తాయి.. అక్కడే తీసుకోండి.. అంటూ ముప్పతిప్పలు పెడుతున్నారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో మొత్తం 121 చౌక దుకాణాల పరిధిలో 47,032 రేషన్ కార్డులున్నాయి. వీరికి నెలనెలా 680 టన్నుల బియ్యం సరఫరా చేస్తారు. మూడు మండలాల్లో జనవరిలో 60శాతం, ఫిబ్రవరిలో 60శాతం, మార్చిలో 70శాతం బియ్యం పంపిణీ జరిగినట్లు రికార్డుల్లో నమోదైంది. మిగిలిన స్టాక్ నిల్వ కింద చూపి తదుపరి నెలకు కేటాయింపులు జరుగుతాయి. ఏప్రిల్ నెలకు డీలర్ల వద్ద స్టాక్ నిల్వలు ఉన్నట్లు రికార్డులు చూపిస్తుండడంతో దాదాపు 30 టన్నుల కోత పడినట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చిన బియ్యాన్ని కూడా సక్రమంగా అందించకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సూళ్లూరుపేటకు రెగ్యులర్ సీఎస్ డీటీ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చూస్తాం

ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే బియ్యం అందేలా చూస్తాం, త్వరలోనే డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను చక్కదిద్దుతాం.

- తహసీల్దార్ నరసింహారావు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సముద్రంలోకి తాబేలు పిల్లల విడుదల



సముద్రతీరంలోకి తాబేలు పిల్లలు వదులుతున్న ఫారెస్టు అధికారులు

వాకాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబుపేట సముద్ర తీరంలో బుధవారం ఫారెస్టు అధికారులు ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక మాట్లాడుతూ సూళ్లూరుపేట డివిజన్ అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా 500 ఆలివ్‌రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచి పెట్టామన్నారు. నవాబుపేట సముద్రతీరంలో తాబేలు గుడ్లను సేకరించి కృత్రిమ విధానంలో పిల్లలను పొదిగించామన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఎఫ్ఆర్‌వో నాగేశ్వరరావు, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు ఏడుకొండలు, ప్రసన్న కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మా బిడ్డలను అంతదూరం పంపలేం



ఆందోళన చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు

పెళ్లకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మా బిడ్డలను కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్లపాడు గ్రామానికి వెళ్లి చదువుకోలేరని, తమ గ్రామంలోనే 3, 4, 5 తరగతులను కొనసాగించాలని అర్ధమాల గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ధర్నా చేపట్టారు. అర్ధమాల ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సోమవారం నుంచి ఆర్లపాడు గ్రామానికి పంపాలని అధికారులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత సుబ్బరామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి



అడ్వైజరీ కమిటీ సభ్యులతో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలుపై డివిజన్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భ్రూణ హత్యలను నివారించాలన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత చూపడం మంచిపద్ధతి కాదన్నారు. లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఎం డాక్టర్ పద్మావతి, బాబునెప్రారెడ్డి పాల్గొన్నారు.

ఐదో తరగతి వరకు కొనసాగించండి



బుసపాళెం పాఠశాలలో ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుసపాళెం ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు కొనసాగించాలంటూ బుధవారం విద్యార్థులు ధర్నా చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎనిమిదో తరగతి వరకు ఉన్న పాఠశాలను గత ప్రభుత్వం ఐదు వరకు కుదించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రెండవ తరగతి వరకు తగ్గించడం తగదన్నారు. 3వ తరగతికి విద్యార్థులు ఆరు కిలోమీటర్లు వెళ్లి చదువుకోవడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రరీ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం శాస్త్రి, అధ్యాపకులు శ్రీనివాసులు, ఏడుకొండలు, రమేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



చెంబేడు పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తున్న ఎంఈవో శంకరయ్య

నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో మించల శంకరయ్య చెంబేడు గ్రామస్తులను కోరారు. బుధవారం చెంబేడు గ్రామంలో పిల్లల తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే చదువుతో పాటు కలిగే ప్రయోజనాలను వివరించారు. 1, 4, 5 తరగతుల విద్యార్థులను చెంబేడు ఎంపీపీ పాఠశాలలో చేర్పించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులుఉ, ఉపాధ్యాయులు, గున్నమ్మ, రమేష్‌బాబు, అంగన్‌వాడీ వర్కర్ సుజాత పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

గూడూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి 28మందిని కాల్చి చంపడం హేయమైన చర్య అని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి సంతాపంగా జెండా అవనతం చేశారు. కార్యక్రమంలో మోహన్, విజయ్, నాగార్జున, వంశీకృష్ణ, మధుసూదన్‌రావు, సాయికిరణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మరాజస్వామి ఉత్సవాలు

తడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాటంబేడు కుప్పంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం నుంచి మే 5వ తేదీ సోమవారం వరకు 11 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 25న మహాకుంభాభిషేకం, ధ్వజారోహణంతో ప్రారంభయ్యే ఉత్సవాలు మే 5వ తేదీ సోమవారం ధర్మరాజుకు పట్టాభిషేకం, శయన సేవతో ముగుస్తాయి. ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ ఆదివారం ద్రౌపదీ కల్యాణం, 29, 30 తేదీల్లో గరుడసేవ, గాంధర్వపర్వం, మే 1న కాలకేయ సంహారం, 4న కురుక్షేత్రం, దుర్యోధన వధ, అగ్నిగుండ ప్రవేశం, తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తంగెళ్లదిబ్బ గిరిజన కాలనీలో తాగునీటి ఎద్దడి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపాల్ రెడ్డిపాలెం పంచాయతీ తంగెళ్లదిబ్బ గిరిజన కాలనీలో నీటి ఎద్దడి నెలకొంది. తాగునీటి కోసం గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గోపాలరెడ్డిపాలెం నుంచి పైపులైన్ల ద్వారా తంగెళ్లదిబ్బ గిరిజన కాలనీ తాగునీరు అందిస్తున్నారు. పలుచోట్ల పైపులైన్లు పగిలిపోవడంతో తాగునీరు సక్రమంగా అందడం లేదు. అధికారులు దావాదిగుంట గ్రామం నుంచి తాత్కాలికంగా పైపులైన్లకు కనెక్షన్ ఇచ్చి తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే పైప్‌లైన్ల లీకేజీతో సక్రమంగా నీరు అందడం లేదు. దీంతో కుళాయిల వద్ద లోతుగా గుంతలు తవ్వి చుట్టూ సిమెంట్ వరలు ఏర్పాటు చేసుకున్నారు. అందులో చేరిన నీటిని బిందెల ద్వారా ఇంటికి తీసుకెళ్లి ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసుకుంటున్నారు. నీళ్లు రానప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని గిరిజనులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గిరిజన కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.



వరల మధ్య గుంతలో నుంచి నీటిని తోడుకుంటున్న గిరిజనులు

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ఎం.శేఖర్(584), యమున(583), వెంకటసూర్య గుణదీప్(582), హనుమంతు(580), ఎస్‌కే.యాసిన్(579), చెంచువందన(578), ప్రజ్ఞతేజ(577), నిఖిలాశ్రీ(575)

చిల్లకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. చిల్లకూరు మండలంలో విద్యార్థులు 84శాతం ఉత్తీర్ణత సాధించారు. నెలబల్లి రెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మేకల శేఖర్ 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. గురుకుల పాఠశాల విద్యార్థి బి.చరణ్‌తేజ 574 మార్కులు, వరగలి జడ్పీ ఉన్నత పాఠశాలో విద్యార్థి పి.పురుషోత్తం 573 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

గూడూరు: గూడూరు మండలంలో పదో తరగతి విద్యార్థులు 63.43 శాతం ఉత్తీర్ణత సాధించారు. చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రమ్యశ్రీ 572, భవ్యశ్రీ 570 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విందూరు పాఠశాలకు చెందిన వెంకటజ్యోత్స్న 569 మార్కులతో తృతీయస్థానంలో నిలిచింది.

కోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. కోటలోని బీసీ బాలుర గురుకులంలో 108మంది విద్యార్థులకు 104మంది ఉత్తీర్ణత సాధించారు. వెంకటసూర్య గుణదీప్ 582 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. చిట్టేడు ఉన్నత పాఠశాలలో 87మందికి 85మంది పాసయ్యారు. చెంచు వందన 578 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఇక గూడలి ఉన్నత పాఠశాల, చిట్టేడు యానాదుల గురుకుల పాఠశాల నూరుశాతం ఫలితాలు సాధించాయి.

డక్కిలి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 76.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. డక్కిలి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని కీర్తన 573, గాయత్రి 568, తీర్థంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీనాధ్ 549, డక్కిలి జడ్పీ పాఠశాల విద్యార్థిని సంధ్య 538 మార్కులు సాధించారు. వీరిని ఎంపీడీవో గుణశేఖరరెడ్డి అభినందించారు.

బాలాయపల్లి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 70శాతం ఉత్తీర్ణత సాధించారు. నిడిగల్లు పాఠశాల విద్యార్థిని టి.హరిణి 574 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బాలాయపల్లి పాఠశాలకు చెందిన కే.అరుణ్‌కుమార్ రెడ్డి 544 మార్కులు, వెంగ మాంబపురం పాఠశాలకు చెందిన కే.రవళి 523 సాధించారు.

వెంకటగిరి టౌన్: మండలంలో పదో తరగతి విద్యార్థులు 80.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సానియా అక్తర్ 586 మార్కులు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి హనుమంతు 580 మార్కులు సాధించారు.

ఓజిలి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. చిల్లమానుచేను జడ్పీ పాఠశాలకు చెందిన ఓజిలి ప్రజ్ఞతేజ (577) మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. అదేవిధంగా ఓజిలి జడ్పీ పాఠశాలకు చెందిన పటాన్ పయిజ్యా(572), తురకా శ్రీహరి(558) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థులను ఎంఈవో శైలజ అభినందించారు.

తడ: మండలంలో పదో తరగతి విద్యార్థులు 67శాతం ఉత్తీర్ణత సాధించారు. పి.వర్షిణి 567 మార్కులతో మొదటి స్థానం సాధించగా పి.మేఘన, ఎస్.వర్షిత 565 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. 553 మార్కులతో పి.కమలకుమారి తృతీయ స్థానంలో నిలిచారు.

నాయుడుపేట టౌన్: మండలంలో పదో తరగతి విద్యార్థులు 64 శాతం ఉత్తీర్ణత సాధించారు. మేనకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆడేరు వందన(589) ప్రథమస్థానం, అదే పాఠశాలకు చెందిన ఎస్‌కే యాసిన్ (579), పుదూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.సుమ (579) ద్వితీయ స్థానం, మేనకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.హంసశ్రీ (574) తృతయ స్థానం సాధించారు. వీరిని ఎంఈవో మునిరత్నం, ఉపాధ్యా యులు అభినందించారు.

పెళ్లకూరు: మండలంలో పదో తరగతి విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 71.4 శాతం మంది ఉతీర్ణత సాధించారు. మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.నిఖిలాశ్రీ 575 మార్కులతో మండల టాపర్‌గా నలిచింది. శిరసనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి.హిందూప్రియ 560 మార్కులు, పాలచ్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.సునీత 559 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

దొరవారిసత్రం: పదో తరగతి ఫలితాల్లో దొరవారిసత్రం మండల విద్యార్థులు 69.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. దొరవారిసత్రం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని కె.రజిత 561 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. శ్రీధనమల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.నిర్విజ్ఞ 560 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

చిట్టమూరు: మండలంలోని పదో తరగతి విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. మెట్టు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సింధు 577 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

సూళ్లూరుపేట: పది ఫలితాల్లో సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. సి.యమున 583మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్.హిమ హస్విని 573, షేక్ సమీరా 563 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

టీడీపీకి సర్వోత్తమరెడ్డి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న సర్వోత్తమరెడ్డి

కోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కోట మండల టీడీపీ అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమరెడ్డి రాజీనామా చేశారు. కోటలోని రవినగర్‌లో గల ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్ష పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నారా లోకేశ్, సీఎం చంద్రబాబుకు ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు సర్వోత్తమరెడ్డి తెలిపారు. రెండు దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న తాను మండలంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని, ప్రస్తుతం వ్యక్తిగత కారణాలు, వ్యాపారాల దృష్ట్యా రాజీనామా చేస్తున్నానని, దీనివెనుక ఎలాంటి ఒత్తిళ్లు, ఎవరి ప్రమేయం లేదని చెప్పారు. తన భవిష్యత్ నిర్ణయాన్ని త్వరలో ప్రకటిస్తానని సర్వోత్తమరెడ్డి తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

దొరవారిసత్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనేపూడిలో గ్రామంలో బెల్టు షాపుపై మంగళవారం రాత్రి ఎస్‌ఐ అజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు శ్రీనివాసులును అరెస్టు చేశారు.

ఎంఈవోకు సన్మానం



మునిశేఖర్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దొరవారిసత్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం ఎంఈవో శెట్టిపల్లి మునిశేఖర్ పదవీ విరమణ పొందారు. బుధవారం మండలం పరిషత్ సమావేశ మందిరంలో మునిశేఖర్ దంపతులను ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే ఎంపీడీవో గోవర్ధన్, వైఎస్ఎంపీపీ గోపాలరెడ్డి ఎంఈవోను సత్కరించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



సూళ్లూరుపేటలో కొవ్వొత్తులతో నిరసన

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల మారణకాండకు ఖండిస్తూ బుధవారం రాత్రి సూళ్లూరుపేటలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్, బెజవాడ విజయలక్ష్మి, బవజాన్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట: కశ్మీర్ సమీపంలో పహల్‌గావ్‌లో ఉగ్రవాదుల మారణకాండను ఖండిస్తూ కోట పట్టణంలో బుధవారం రాత్రి బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడితో మృతిచెందిన యాత్రికుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

కోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కోట మండలం మైక్రో టవర్ కాలనీ వద్ద బైక్ ఢీకొన్న ఘటనలో నెల్లూరు నేతాజీనగర్‌కు చెందిన శివకుమార్(40) మృతి చెందాడు. బుధవారం కోట నుంచి నెల్లూరుకు కారులో వెళుతున్న శివకుమార్ మైక్రోటవర్ కాలనీ వద్ద మూత్ర విసర్జన కోసం ఆపి కిందకు దిగాడు. అదే సమయంలో చిట్టమూరు మండలం మెట్టుకు చెందిన యువకుడు బైక్‌లో గూడూరు వైపు వెళుతూ శివకుమార్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శివకుమార్ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని మరొకరు..

దొరవారిసత్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లి కూడలిలో జాతీయ రహదారిపై కారు ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన పున్నేపల్లి పోలయ్య(55) దుర్మరణం చెందాడు. పోలయ్య రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి విజయవాడ వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో పోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నాయుడుపేట సమీపంలో కారును పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తికి రిటైర్‌మెంట్ లేదు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈవో మస్తానయ్య, ఉపాధ్యాయ సంఘ నేతలు

కోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్నత స్థానముందని, ఉపాధ్యాయుడికి రిటైర్‌మెంట్ లేదని ఎంఈవో మస్తానయ్య అన్నారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దైవాలదిబ్బ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఉషాకుమారి, గూడలి ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న వెంకటరత్నం పదవీ విరమణ సభ జరిగింది. యూటీఎఫ్, పీఆర్‌టీయూ, బీటీఏ, ఎస్‌టీయూ నేతలు ఉపాధ్యాయులను షీల్డ్‌లు, మెమోంటోలతో సత్కరించారు.

విద్యార్థినికి అభినందన

గూడూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి సాయివైశాలి 598 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఆమెను ప్రిన్సిపాల్ శ్రీనివాసులుతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.



సాయివైశాలిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

విద్యార్థినికి కలెక్టర్ అభినందన



వందనను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో నాయుడుపేట మండలం మేనకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆడేరు వందన(589) మార్కులతో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వందనను కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈవో కుమార్, ఎంఈవో మునిరత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

బాలాయపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాయపల్లి, జయంపు కెనరా బ్యాంకు పరిధిలో ఎస్సీలు రాయితీ రుణాలకు వచ్చే నెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ కోరారు.

చట్టప్రకారం నష్టపరిహారం అందించాలి



సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం గ్రామంలో క్రిస్ సిటీ భూములకు సంబంధించి రైతులకు చట్టప్రకారం నష్ట పరిహారం అందించాలని సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కోట మండలం కొత్తపట్నంలో రైతులు సాగు చేసుకుంటున్న వేరుశనగ పంటను ధ్వంసం చేయడం సబబు కాదన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీ మణయ్య, శంకరయ్య, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆమె వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుసు దొంగ అరెస్టు
రెండు సెల్‌ఫోన్లు, బంగారు చైను స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి వెస్ట్ పరిధిలో గొలుసు దొంగను అరెస్టు చేసి, బంగారు చైను, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా యాదమరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దేవరాజులు తిరుపతి రూరల్ మండలం బీటీఆర్ కాలనీలో కాపురముంటూ పెయింట్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తిరుపతి నగరంలో పలుచోట్ల చోరీలకు పాల్పడ్డాడు. గతనెల త్యాగరాజనగర్‌కు చెందిన మహిళ మెడలో గొలుసు చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం దేవరాజులును అరెస్టు చేశారు. అతని నుంచి 17 గ్రాముల బంగారు చైను, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను ఏకపక్షంగా ఎంపిక చేయడం దారుణం

● ఎంపీడీవోకు టీడీపీ నాయకుల ఫిర్యాదు


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను ఏకపక్షంగా ఎంపిక చేశారని, ఆ జాబితను రద్దు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో త్రివిక్రమ్ రావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన వారు చాలామంది ఉన్నారని, వైసీపీకి చెందిన ఆరుగురిని ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. ఆ జాబితాను రద్దు చేయాలని కోరారు. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ మాజీ కన్వీనర్, జడ్పీటీసీ కార్యాలయంలో మధ్యవర్తిత్వాలు చేస్తున్నారని, తక్షణం ఆ గదిని ఖాళీ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, టీడీపీ నాయకులు మునిరాజా, రవినాయుడు, శ్రీనివాసులు, మునిబాబు, భాస్కర్‌యాదవ్, భద్ర, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు

ముక్కంటి సేవలో నవయుగ ఎండీ చింతా శ్రీధర్



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం నవయుగ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ చింతా శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పాఠశాలల రేషనలైజేషన్ పారదర్శకంగా చేపట్టండి


విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టెన్త్ ఫలితాలను బుధవారం తన స్వగృహంలో విద్యాశాఖాధికారులతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సమీక్షించారు. పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల కమిటీల నిర్ణయం ప్రకారం చేపట్టాలని సూచించారు. డీఈవో కుమార్, డీవైఈవో ప్రభాకర్‌రాజు, ఎంఈవో తిరుమలరాజు పాల్గొన్నారు.

టెన్త్‌లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు


హేమశ్రీ

వడమాలపేట, 23 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 328 మంది టెన్త్ పరీక్షలకు హాజరవగా 230 మంది ఉత్తీర్ణులయ్యారు. 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని పత్తిపుత్తూరు ఉన్నత పాఠశాలలో 84 శాతం, సీతారామపురం ఉన్నత పాఠశాలలో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల పరంగా తడుకు ఆర్.ఎస్. ఉన్నత పాఠశాల విద్యార్థి హేమశ్రీ 561 మార్కులు సాధించింది.


మేఘన - అమృత

పుత్తూరు (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఫలితాల్లో 61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాలలో అత్యధికంగా 96 శాతం అతి తక్కువగా గేట్ పుత్తూరులోని తెలుగు పాఠశాలలో 28 శాతం ఫలితాలు నమోదయ్యాయి. కాగా మండలంలో 571 మార్కులను పట్టణంలోని బాలికల పాఠశాలకు చెందిన మేఘన, రాచపాలెంకు చెందిన అమృత సాధించారు



పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమజ పాఠశాల విద్యార్థులు టెన్త్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరినట్లు పాఠశాల ఛైర్మన్ సురేంద్రరాజు పేర్కొన్నారు. కె.శ్రావ్య 571 మార్కులు, ఎస్.భువన శ్రీ 570, సి.చరిష్మా 569 మార్కులు సాధించారన్నారు. 72 మంది విద్యార్థులకు 28మంది 500 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజోవతి, సిబ్బంది అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వడమాలపేట.23 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 24న గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

శ్రీవిద్యా కళాశాలను సందర్శించిన విదేశీ శాస్త్రవేత్తలు



విదేశీ ప్రొఫెసర్లతో కళాశాల అధ్యాపకులు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలను ఇండోనేషియా, థాయ్ లాండ్ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు సందర్శించారు. ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్శిటీలకు చెందిన బయో టెక్నాలజీ, ఫిజిక్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు ఇండోనేషియాకు చెందిన శాస్త్రవేత్త జాక్రాపాంగ్, థాయ్‌లాండ్‌కు చెందిన శాస్త్రవేత్త మిత్ర డిజామాల్ హాజరయ్యారు. ఈక్రమంలో ఎస్వీయూ అనుబంధ కళాశాలల సందర్శనలో భాగంగా శ్రీవిద్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో భేటీ అయ్యారు. భౌతికశాస్త్ర, శాస్త్ర సాంకేతిక రంగాల్లో కొత్త ఆవిష్కరణలపై వారికి అవగాహన కల్పించారు. అలాగే కళాశాలలో మౌలిక వసతులు, వివిధ శాఖల పనితీరును హర్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ మాణిక్యం, ఎంబీఏ, ఎంసీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిహరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యజ్ఞోపవీతం కత్తిరించడం దారుణం

పుత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, షిమోగా పట్టణాల్లో సెట్ పరీక్షలకు హాజరైన బ్రాహ్మణ అభ్యర్థుల యజ్ఞోపవీతాను కత్తరించడం అమానుషమని పుత్తూరు పట్టణానికి చెందిన గాయత్రి బ్రాహ్మణ సంఘం నిరసన వ్యక్తం చేసింది. ఈ సంఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని దుండగులను శిక్షించాలని డిమాండ్ చేసింది. రామకృష్ణ, రమేష్‌బాబు, సేతురామన్ శర్మ, బాలాజీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

పుత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ స్థానిక బీజేపీ నాయకులు బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గిరిప్రసాద్, చెన్నకేశవులు, బాబు, హరి పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో మూడు నెలల శిక్షణ

● నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలలో భాగంగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. శిక్షణ అనంతరం కుట్టు మెషీన్ ఉచితంగా అందించ నున్నారు. ఈ శిక్షణ కోసం గత నెల దరఖాస్తులను ఆహ్వానించారు. మొత్తం 349 మంది దరఖాస్తు చేసుకోగా అర్హతల ఆధారంగా 140 మందిని ఎంపిక చేశారు. ఈనెల 24న గురువారం నుంచి ప్రారంభం కానున్న శిబిరాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించనున్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పుత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని రాచపాలెం లో బుధవారం 107 ఏళ్ల వృద్ధురాలు సుబ్బలక్ష్మమ్మ మృతి చెందారు. 1918 జూన్ 1న జన్మించిన ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి వృద్ధాప్యం కారణంగా నేడు మరణించారని కుమారుడు సుధాకర్‌రాజు తెలిపారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో నూతనంగా నిర్మించిన శివాలయంలో మృత్యుంజయస్వామి విగ్రహ ప్రతి ష్ఠాపన, మహాకుంభాభిషేకం ఆగమోక్తంగా జరిగింది. ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, డిపో మేనేజరు మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కంచుకోటలో మూడు ముక్కలాట?

సత్యవేడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కంచుకోట సత్యవేడు నియోజకవర్గం టీడీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. దీంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య మూడుముక్కలాట జరుగుతోందని ఆపార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆదిమూలం మాత్రం తన అనుకూలవర్గంతో అటు పార్టీ కార్యక్రమాల్లోనూ, ఇటు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటు ప్రభుత్వ వాయిస్‌ను తీసుకెళ్తున్నారు. ఇదిలా ఉండగా గత ఎన్నికల పరిశీలకుడిగా నియోజకవర్గానికి వచ్చిన అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు, పల్లెపండుగ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వచ్చిన గూడూరుకు చెందిన శ్రీపతిబాబు ఆధ్వర్యంలో మరో వర్గం నియోజకవర్గంలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరిద్దరు ఇన్‌చార్జి పదవికోసం నియోజకవర్గంలో వర్గపోరుకు ఆజ్యం పోస్తున్నారని ఎమ్మెల్యే వర్గం బహిరంగంగా ఆరోపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల పరిశీలకుడిగా వచ్చిన చంద్రశేఖర్ నాయుడు, పల్లెపండుగ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వచ్చిన శ్రీపతిబాబు ఇంకా నియోజకవర్గంలోనే తిష్ఠవేసి అధికారులను ప్రభావితం చేస్తున్నట్లు ఆ వర్గం ఆరోపిస్తోంది. ఇక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మూడో వర్గం వేరు కుంపటి ఏర్పాటు చేసుకుని పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ వర్గం గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఎన్ఆర్ఐ వర్గం (చెరకు బ్యాచ్)గా ప్రచారంలో ఉంది. ఈ ఎన్ఆర్ఐ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పదవి పొందాలని పైస్థాయిలో పావులు కదుపుతున్నట్లు నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా మాజీ మహిళా ప్రజా ప్రతినిధి సైతం ఇన్‌చార్జి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. టీడీపీ అదిష్ఠానం కల్పించుకుని నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను చక్కబెట్టాలని కోరుతున్నారు.

పదిలో ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు


కేతన్‌కు సన్మానం


తనీస్‌రాజ్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెట్టు ప్రాంతానికి చెందిన కేతన్ బాబుఅగ్రహారం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివాడు. బుధవారం వెలువడిన పది పరీక్షా ఫలితాల్లో 589 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా డీఈవో కె.వి.ఎస్.కుమార్ శ్రీకాళహస్తిలోని విద్యార్థి ఇంటికి చేరుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తనీష్‌రాజ్ 584 మార్కులతో ప్రతిభ చూపాడు. మొత్తం శ్రీకాళహస్తి పట్టణ, గ్రామీణం పరిధిలో 22 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రాచగున్నేరి పాఠశాల, పట్టణంలోని పానగల్‌లోని ఉన్నత పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించాయి.

కేజీబీవీలో 82శాతం ఉత్తీర్ణత


చందన ప్రియ- దివ్య - యాస్మిన్

కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షా ఫలితాల్లో మండలంలో బాలికలు సత్తా చాటారు. కేజీబీవీ పాఠశాల 82శాతం ఉత్తీర్ణత సాధించింది. 39 మందికి గాను 32మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. ఈ యేడాది మండలంలో 430మంది పరీక్షలకు హాజరు కాగా 311 మంది ఉత్తీర్ణత సాధించారు.


రూపశ్రీ - మనోజ్ - మనీషా

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలో టెన్త్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో 29 మంది విద్యార్థులకు గాను 22 మంది, నెలవాయి ఉన్నత పాఠశాలలో 38 విద్యార్థులకు గాను 15 మంది, బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో 126 మంది విద్యార్థులకు 61 మంది, పల్లమాల ఉన్నత పాఠశాలలో 56 మందికి గాను 29 మంది, చల్లమాంబపురం ఉన్నత పాఠశాలలో 8 మందికి గాను ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు. పల్లమాల పాఠశాల విద్యార్థిని రూపశ్రీ 559 మార్కులు సాధించింది. ఇదే పాఠశాలలో మనోజ్ 553 మార్కులు, మనీష 540, కల్లివెట్టు పాఠశాలకు చెందిన ఇందు 526 మార్కులు సాధించారు.


మాధవి

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలో టెన్త్ ఫలితాల్లో బాలికలదే పై చేయిగా నిలిచింది. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బండి మాధవి 573 మార్కులు సాధించింది. జడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థి రిషిఈశ్వర్ 572 మార్కులు, రేణిగుంట బాలిక ల ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజస్విని 560 మార్కులు సాధించారు. మండలంలో 59.61 ఉత్తీర్ణత శాతం నమోదైంది.


హేమావతి

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 372 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవగా 236 మంది ఉత్తీర్ణత సాధించారని డీవైఈవో ప్రభాకర్ రాజు తెలిపారు. పాలమంగళం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.చరిష్మా 588 మార్కులు సాధించింది. నారాయణవనం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని మహాలక్ష్మి 585 మార్కులు, హేమావతి 582 మార్కులు సాధించారు. ఎ.వి.మోనిశ్రీ 580, ఏ.యామిని 579, ఏ.యశస్వీ 577, ఏ.యశోధ 572, డి.సి. శివాత్మిక 569, పి.దివ్యశ్రీ 569 సాధించగా, నారాయణవనం జడ్పీ బాలుల ఉన్నత పాఠశాల విద్యార్థి జి.మహేష్ 570 మార్కులు సాధించినట్లు తెలిపారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షా ఫలితాల్లో సత్యవేడు మండలంలో 64 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో రవి తెలిపారు.


ఉదయకుమార్ - బెన్‌హర్‌బాబు - జశ్వంత్

ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు టాపర్‌లుగా నిలిచారు. పాఠశాలకు చెందిన జే.ఉదయకుమార్ 580, బీ.బెన్‌హర్‌బాబు 574, ఏ.జశ్వంత్ 572 మార్కులు సాధించారు. అదే విధంగా ఇరుగుళం జడ్పీహైస్కూల్ విద్యార్థిని టీ.నందిని 571, ప్రత్యూష 568, బాలికల హైస్కూల్ విద్యార్థిని కె.పావని 560, మదనంబేడు హైస్కూల్ విద్యార్థిని ఎన్.లేఖ 560. బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎన్.సౌజన్య 559 మార్కులు సాధించడం గమనార్హం.


విజయ్

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో టెన్త్ ఫలితాల్లో 65 శాతం ఉత్తీర్ణత సాధించింది. 214 మంది పరీక్షలకు హాజరు కాగా 140 మంది ఉత్తీర్ణత సాధించారు. పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విజయ్ 562 మార్కులు, లావణ్య 551, పులికుండ్రం జడ్పీ హైస్కూలు విద్యార్థి విష్ణుజా 547 సాధించారు.


లాస్యశ్రీ

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 48.46 ఉత్తీర్ణత నమోదైంది. వరదయ్యపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన లాస్యశ్రీ 561 మార్కులతో ప్రతిభ కనబరిచింది.

ఉగ్ర దాడి మృతులకు నివాళులు


పార్టీ జెండాను అవనతం చేస్తున్న కోట వినుత - నారాయణవనం, శ్రీకాళహస్తిలో కొవ్వొత్తులతో నివాళి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి మృతులకు బుధవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. జమ్ము కశ్మీర్‌లోని బైసారన్ దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు తెగబడి 26 మందిని కాల్చడం కలచి వేసిందన్నారు. పార్టీ అధినేత పవన్ పిలుపు మేరకు మూడు రోజులు సంతాప దినాలుగా పాటిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యాలయం వద్ద పార్టీ జెండాను అవనతం చేశారు. శివకుమార్, చంద్రశేఖర్, తోట గణేష్, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళుల ర్పించారు. రమేష్‌బాబు, జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి విజయకుమార్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని ఎమ్మెల్యే సుధీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి దుశ్చర్యలు దేశాన్ని కుదిపేయలేవని మన సైనికుల ధైర్యం ప్రజల ఐక్యతే వాటికి బలమైన సమాధానం ఇస్తుందన్నారు. కాగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, తోట గణేష్, చిరంజీవి, నాగరాజు, భాగ్యలక్ష్మి, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి అమానుషమని సత్యవేడు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఉగ్రదాడిని ఖండిస్తూ బీజేపీ, జనసేన నాయకులు ఉమ్మడిగా నారాయణవనంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి బీజేపి నాయకులతో కలిసి బుధవారం రాత్రి రైల్వేస్టేషన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. అలాగే రేణిగుంట వర్కింగ్ జర్నలిస్టులు ఉగ్ర దాడిని ఖండిస్తూర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఇందుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రేణిగుంట, శ్రీకాళహస్తిల్లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రేపు సత్యవేడులో మెగా జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సత్యవేడులోని దాస్ ఆర్ట్స్, సైన్స్ కళాశాల వేదికగా శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శ్రీసిటీ, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీల్లో 800 ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440374535ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో మేడేకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ... కార్మికులను బాని సలుగా మార్చే లేబర్‌కోడ్‌ల రద్దుకు పోరాడు దామన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు జాకీర్ మాట్లాడుతూ మేడే రోజు పలు చోట్ల జెండా ఆవిష్కరణల అనంతరం ర్యాలీ నిర్వహించి సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వెంకటరత్నం, శోభ, స్వరాజ్యలక్ష్మి, కల్పన, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు దోపిడీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లమాలకు చెందిన విజయమ్మ బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగలు దోపిడీ చేశారు. కుటుంబ సభ్యులు కథనం మేరకు మంగళవారం రాత్రి విజయమ్మ ఆరుబయట నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలోని 32 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనపై ఎస్ఐ విశ్వనాథనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ ఆక్రమణలపై కేసు నమోదు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సముదాయ భూముల్లో ఇంటి స్థలాలను ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. కనమనంబేడుకు చెందిన కొందరు బుధవారం ఇంటి స్థలాల కోసం భూమిని ఆక్రమించి గుడిసెలు వేస్తుండటంతో వీఆర్వో బాలమురళి అడ్డుకున్నారు. అలాగే ఆక్రమణలకు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ శ్రీదేవి హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


రామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. మండలంలోని అరవ కొత్తూరుకు చెందిన రామిరెడ్డి (60) బుధవారం సొంత పనుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై తొట్టంబేడు మండలంలోని జ్ఞానంబకండ్రిగకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బెంగళూరు నుంచి నెల్లూరు వెళుతున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో రామిరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ సహా కారును అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తిప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

మండల ప్రగతికి కృషి చేద్దాం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఎంపీడీవో కార్యాయలంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పక్కా గృహ నిర్మాణాల కోసం పేదలకు వెంటనే ఇంటి హక్కు పత్రాలను మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. వివిధ దశల్లో ఆగిపోయిన 1,541 పక్కాగృహాల మరమ్మతులకు రూ.3కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీవో ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు, సీడీపీవో దేవకుమారి, ఏవో గౌరి తదితరులు పాల్గొన్నారు.